

రాష్ట్రస్థాయి టాలెంట్ టెస్టుకు విద్యార్థుల ఎంపిక

దారూరు, ఫిబ్రవరి 3: మండల పరిధిలోని కుక్కింద జిల్లా పరిషత్ పాఠశాలకు చెందిన విద్యార్థులు నీలకంఠం, స్పందన జిల్లాస్థాయి సోషల్ టాలెంట్ టెస్టు పోటీల్లో ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. శనివారం వికారాబాద్‌లో నిర్వహించిన జిల్లా స్థాయి సోషల్ టాలెంట్ టెస్టులో నీలకంఠం ప్రథమ స్థానంలో, స్పందన తృతీయ స్థానంలో నిలిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ విద్యార్థులను హెచ్ఎం రవీందర్‌రెడ్డి, ఉపాధ్యాయులు అభినందించారు.



వ్యాపారుల మాయజాలంలో పత్తి రైతులు చిత్తవుతున్నారు. జిన్నింగ్ మిల్లుల్లోనే సీసీఐ కొనుగోలు కేంద్రాలు కొనసాగుతుండడంతో పత్తి అమ్మకాల్లో భారీ మోసాలు జరుగుతున్నాయి. పత్తి అమ్మకాల్లో మార్కెట్ కమిటీలు, ప్రభుత్వ శాఖల అధికారులు అసలు పట్టించుకోకపోవడంతో వ్యాపారులది ఆడిందే ఆటగా, పాడిందే పాటగా మారింది. దీంతో పత్తి రైతులు వ్యాపారుల వలలో చిక్కుకుని తక్కువ ధరకు అమ్ముకుని ఆర్థికంగా తీవ్రంగా నష్టపోతున్నారు.

- జిన్నింగ్ మిల్లులే సీసీఐ కేంద్రాలు
- కేంద్రాల వద్దనే వ్యాపారుల కొనుగోళ్లు
- తత్కాల్ నమోదు అవకాశం.. వ్యాపారులకు వరం
- తూకాల్లో భారీ మోసాలు ...
- చోద్యం చూస్తున్న అధికారులు, మార్కెట్ కమిటీలు
- జిన్నింగ్ మిల్లులు చెప్పిందే అధికారుల నమోదు



పూడూరు శివారులోని జిన్నింగ్ మిల్లులో అన్‌లోడ్ చేస్తున్న పత్తి



సిండికేటుగాళ్లు!

పత్తి రైతులకు టోకరా

- జిన్నింగ్ మిల్లుల్లో మాయ!!
- పత్తి అమ్మకాలపై పట్టించుకోని మార్కెట్ అధికారులు

పరిగి, ఫిబ్రవరి 3 : జిల్లాలో జిన్నింగ్ మిల్లుల వ్యాపారుల కనుసన్నల్లోనే పత్తి వ్యాపారం సాగుతోంది. సీసీఐ కేంద్రాల మాట అటుంచితే, వరి, మొక్కజొన్న రైతుల మాదిరిగా పత్తి గ్రామాల్లో అమ్ముకునేందుకు కొనుగోలు కేంద్రాలు లేవు. పండించిన మొత్తం పత్తిని సీసీఐ కొనుగోలు చేసే పరిస్థితీ లేదు. దీంతో జిన్నింగ్ మిల్లులే అడ్డాగా దళారుల హవా కొనసాగుతోంది. సీసీఐ కేంద్రాల్లో అధికారులు తేమ శాతం, పత్తి నాణ్యత పేరుతో కొర్రీలు పెడుతుండడంతో రైతులు సీసీఐకి తీసుకెళ్లినా కొనే పరిస్థితి లేక అక్కడే ఉన్న దళారులకు ఏడికోకాడికి కాంట వేస్తున్నారు. నిబంధనల పేరుతో సీసీఐ పెడుతున్న ఇబ్బందుల కారణంగానూ పత్తి వ్యాపారులకు అమ్మే పరిస్థితి ఏర్పడుతోందని రైతులకు వాపోతున్నారు. పత్తి సీసీఐ కేంద్రాలకు తరలించకుండానే బయటే అమ్మేసుకుంటున్నారు. జిల్లాలో జిన్నింగ్ మిల్లుల వ్యాపారుల కంట్రోల్‌లోనే పత్తి వ్యాపారం జరుగుతోంది. వ్యాపారులు గ్రామాలకు వెళ్లి పత్తి కొంటున్నారు. ఈ కొనుగోళ్లపై మార్కెటింగ్ శాఖ అధికారులు నిఘా లేదు. ఒకవేళ వ్యాపారులే కొన్నా సీసీఐ ధరకు తక్కువ కాకుండా చెల్లించాలి. రైతులు ఎలాగూ సీసీఐకి అమ్మరనే విషయం పసిగట్టి వ్యాపారులు తక్కువ ధర, తూకం, తేమ పేరుతో దగా చేస్తున్నారు. పరిగి, వికారాబాద్, తాండూరు, కొడంగల్, కోట్‌పల్లి, మర్పల్లి ప్రాంతాల్లో మొత్తం 14 కాటన్ మిల్లులున్నాయి. ప్రభుత్వం 'ఎ'గ్రేడ్ క్వింటాలుకు రూ.7,020 గ్రేడ్-'బి'కి రూ.6,970గా నిర్ణయించింది.

గతేడాది కంటే పెరిగిన సాగు విస్తీర్ణం

జిల్లాలో 18 మండలాల్లో ఈ సారి 2,51,117 ఎకరాల్లో పత్తి సాగుచేశారు. గతేడాది కంటే ఎక్కువే వేశారు. అయితే భారీ వర్షాలతో దాదాపు లక్ష ఎకరాల్లో పత్తి పంటకు నష్టం వాటిల్లింది. సాగుకు అన్ని రకాలా అనుకూలిస్తే సాధారణంగా ఎకరానికి 12నుంచి 20క్వింటాళ్ల దిగుబడి వచ్చేది. ఈ సారి అతివృష్టి, రోగాలతో ఎకరానికి 6క్వింటాళ్ల లోపే వచ్చింది. జిల్లాలో 18లక్షల క్వింటాళ్లకు పైగా దిగుబడి వస్తుందని అంచనా. ఇప్పటి వరకు 27వేల మంది రైతుల నుంచి సీసీఐ 6.3లక్షల క్వింటాళ్లు, అలాగే వ్యాపారులు 4.3లక్షల క్వింటాళ్ల చొప్పున పత్తి కొనుగోలు చేశారు. ఇప్పటి వరకు రైతులు పండించిన 60శాతం పంటను ఈ రెండు మార్గాల ద్వారా కొనుగోలు చేసినట్టయింది.



మిల్లు వద్ద ఆందోళనకు దిగిన రైతులు(ఫైల్)

తేమ శాతంతో కొర్రీలు

సీసీఐ క్వింటాల్ పత్తి రూ.7,020 ఉండగా, సీసీఐ అధికారులు మాత్రం తేమ శాతం పేరుతో కొర్రీలు పెడుతున్నారు. అధికారులు పెట్టే తేమ శాతం, నాణ్యత, ఇతర అంశాలను పూర్తిచేయడం రైతులకు గగనమైతోంది. దీంతో రైతులు వ్యాపారులకు అమ్ముకుంటున్నారు. సీసీఐ అధికారుల తీరును గర్హిస్తూ ఇటీవల పూడూరు, రంగంపల్లి, ధారూర్, వికారాబాద్, లక్ష్మీనారాయణపూర్ జిన్నింగ్ మిల్లుల వద్ద రైతులు ఆందోళనలు సైతం చేశారు. కేంద్ర ప్రభుత్వ మద్దతు ధర ఇచ్చి తమ పత్తి కొనాలని డిమాండ్ చేశారు. వ్యాపారులతో అధికారులు కుమ్మక్కై లేనిపోని నిబంధనలు పెడుతూ తమపట్ల కక్షపూరితంగా వ్యవహరిస్తున్నారని, విధిలేని పరిస్థితుల్లో వ్యాపారులకు అమ్ముకునేలా చేస్తూ మోసగిస్తున్నారని రైతులు వాపోయారు. సీసీఐ కేంద్రాలను నామమాత్రంగా నిర్వహిస్తున్నారని, వారు కొంటున్న పత్తి చాలా తక్కువ అని రైతులు పేర్కొన్నారు. వ్యాపారుల కొమ్ముకాస్తూ రైతులను నష్టపరిచేలా చేస్తున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని, పండిన పత్తి మొత్తం సీసీఐ కొనాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వందలాది మంది రైతులు ధర్నాలో పాల్గొన్నారు. అయినా ఉన్నతాధికారులు తీసుకున్న చర్యలు శూన్యం. సీసీఐ కొనని పత్తిని మిల్లు వద్దే వ్యాపారులు క్వింటా రూ.6,000 నుంచి రూ.6,500కు కొని అదే పత్తిని మళ్లీ సీసీఐకి రూ.7,020కు అమ్ముతున్నారు. దీంతో రైతులు నష్టపోతున్నారు. పరిగి, వికారాబాద్, తాండూరు మార్కెట్ల పరిధిల్లో సీసీఐ కొనుగోలు కేంద్రాలను నిర్వహిస్తోంది. వ్యవహారం అంతా దళారులు, మిల్లుల వ్యాపారులదే. మార్కెటింగ్ శాఖ యార్డుల్లో వసతులు కల్పించి వేలం ద్వారా రైతుల నుంచి పత్తి కొనుగోలు చేయాలి. కానీ జిల్లాలో ఇది ఎక్కడా అమలు కావడం లేదు. మార్కెటింగ్ శాఖ అధికారుల అనుమతిలేకుండా పత్తి అమ్మకాలు జోరుగా జరుగుతున్నాయి. మార్కెటింగ్ శాఖ పర్యవేక్షణలో జరగాల్సిన అమ్మకాలు జిన్నింగ్ బిల్లుల్లోని అంతర్గతంగా సాగిపోతున్నాయి. వ్యాపారులు చెప్పిన లెక్కలు అధికారులు రికార్డు చేసుకుంటున్నారు. దీంతో అటు రైతులకు, ఇటు మార్కెట్ కమిటీల ఆదాయానికి భారీ గండిపడుతోంది.

తత్కాల్ నమోదుతో వ్యాపారులకు వరం..

సీజన్ల వారీగా రైతులు పండించిన పంటల వివరాలను వ్యవసాయాధికారులు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి. ఈ క్రమంలో నమోదులో చేసిన తప్పిదాలతో రైతులకు ఇబ్బందులు తప్పడం లేదు. ఆన్‌లైన్‌లో రైతు పంట వివరాలు నమోదు కాకపోవడంతో సీసీఐలో పత్తిని అమ్ముకునే పరిస్తితి లేదు. దీంతో కలెక్టర్ ఆదేశాల మేరకు రైతులు పత్తి సీసీఐకి అమ్ముకునేందుకు తత్కాల్ పద్ధతిలో ధ్రువీకరణ పత్రం ఇచ్చేందుకు ఏఈవో, ఆర్‌ఐలకు అవకాశం కల్పించారు. దీనిని ఆసరాగా చేసుకుంటూ దళారులు రైతుల వద్ద తక్కువ రేటుకు పత్తి కొని తత్కాల్ ధ్రువీకరణ పత్రా లను కూడా రైతుల పేరిట తీసుకుంటూ సీసీఐలో ఎక్కువ ధరకు అమ్ముకుంటున్నారు. తత్కాల్ వ్యాపారుల మోసాల కు వరంగా మారింది. ఇలా వ్యాపారులు నయాదందాకు తెరలేపారు. పత్తి సాగు చేయకున్నా ఏఈవో, ఆర్‌ఐల వద్ద నమోదుచేయించుకొని బీనామీల పేర్ల మీద పత్తి విక్రయాలు జరుపుతూ రూ.కోట్లు గడిసున్నారు. దీనిపై అధికారులు నిఘా పెట్టకపోవడంతో రైతుల మోసపోతున్నారు. దోపిడీ యథేచ్ఛగా కొనసాగుతోంది.

తూకాల్లో భారీ మోసాలు

మార్కెట్ కమిటీల అధికారుల పట్టింపు లేని ధోరణితో మిల్లుల్లో తూకాల్లో మోసాలకు పాల్పడుతున్నారు. పరిగి, వికారాబాద్, తాండూరు, కొడంగల్, కోట్‌పల్లి, మర్పల్లి ప్రాంతాల్లో జిన్నింగ్ మిల్లులున్నారు. వీటిపై అధికారుల పర్యవేక్షణ లేక బయట మార్కెట్ కంటే తక్కువ ధరకే కొనుగోలు చేస్తున్నారు. మార్కెట్ కమిటీల్లో అయితే వేలం పెట్టి ధరలను నిర్ణయించే అవకాశం ఉండేది. ప్రైవేట్ మిల్లుల్లో ఇదేమీ లేక వ్యాపారులు చెప్పిన ధరలకే అమ్ముకోవాల్సిన పరిస్థితి ఉందని రైతులు వాపోతున్నారు. అడిగేవారే లేరు కదా? అని తూకాల్లోను మోసాలకు పాల్పడుతున్నారు. అన్ని జిన్నింగ్ మిల్లుల్లో వే బ్రిడ్జిపై తూకం చేసిన తర్వాత అన్‌లోడ్ చేస్తారు. ఈ తూకాన్ని రైతులకు అసలే చూపించరు. వారు వేసిన వెయిట్ ప్రకారమే బిల్లు వస్తుంది. మార్కెట్ అధికారులకు తెలిసే ఈ తతంగం జరుగుతోందా? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

విచారణ జరిపిస్తాం



పత్తి కొనుగోళ్లలో అక్రమాలకు తావులేదు. జిల్లాలోని 14 జిన్నింగ్ మిల్లుల ద్వారా పత్తి కొనుగోళ్లు జరుగుతున్నాయి. దళారుల నుంచి కొనుగోళ్లు జరుగుతున్నాయన్న ఆరోపణల్లో వాస్తవం లేదు. ఎక్కడైనా నిబంధనలకు విరుద్ధంగా కొనుగోళ్లు జరిగినట్లు ఆధారాలతో రైతులు ఫిర్యాదు చేస్తే విచారణ చేసి చర్యలు తీసుకుంటాం.

-సారంగపాణి జిల్లా మార్కెటింగ్ అధికారి

తెల్లరేషన్ కార్డుదారులకు ఈ-కేవైసీ చేయించాలి



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యానాయక్

వికారాబాద్, ఫిబ్రవరి 3: తెల్లరేషన్ కార్డుదారులు, వారి కుటుంబీకుల ఈ-కేవైసీ చేయించేందుకు చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ అన్నారు. శనివారం కలెక్టరేట్‌లో పౌర సరఫరాల అధికారి రాజేశ్వర్, జిల్లా మేనేజర్ కొండల్‌రావు, రేషన్ దుకాణాల డీలర్లతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. ఫిబ్రవరి మాసం వరకు జిల్లాలో వంద శాతం ఈకేవైసీ పూర్తిచేయాలని ఆదేశించారు. ఎవరైనా డీలర్లు రేషన్ బియ్యాన్ని పక్కదారి పట్టిస్తే వారి డీలర్‌షిప్‌ను రద్దు చేయడంతో పాటు, క్రిమినల్ కేసులు సైతం నమోదు చేస్తామని ఈ సందర్భంగా హెచ్చరించారు. జిల్లాలో బినామీ డీలర్లు ఉంటే అలాంటి వారిని గుర్తించి పౌరసరఫరాల అధికారులు, తహసీల్దార్లు, డిప్యూటీ తహసీల్దార్లు విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. తెల్లరేషన్ కార్డులబ్ధిదారులు రేషన్ దుకాణాల నుంచి బియ్యం తీసుకుని ఇతరులకు అమ్మితే వారిపైనా చర్య చేపట్టాలన్నారు. లబ్ధిదారులు తీసుకున్న బియ్యాన్ని సొంతానికి వాడుకోవాలని తెలిపారు. గ్రామాల్లో రేషన్ బియ్యం కొనేందుకు వస్తున్న వారి సమాచారాన్ని అధికారులకు తెలియపరచాలన్నారు. డీలర్లు సకాలంలో దుకాణాలను తెరచి లబ్ధిదారులకు మంచి రేషన్ బియ్యం పంపిణీ చేయాలని ఈ సందర్భంగా ఆయన తెలియజేశారు. సమావేశంలో రేషన్‌డీలర్ల సంఘం అధ్యక్షుడు జూకారెడ్డి, డిప్యూటీ తహసీల్దార్లు పాల్గొన్నారు.

సేవాలాల్ ఆలయ వార్షికోత్సవంలో స్పీకర్, ఎమ్మెల్యే



సేవాలాల్ పూజల్లో పాల్గొన్న స్పీకర్ ప్రసాద్‌కుమార్

వికారాబాద్, ఫిబ్రవరి 3 : జగదాంబ భవానీ, సేవాలాల్ మహరాజ్ ఆలయ 17వ వార్షికోత్సవాన్ని వికారాబాద్‌లోని వెంకటాపూర్ తండాలో ప్యాక్స్ చైర్మన్ కిషన్‌నాయక్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. శనివారం మూడో రోజు హోమ కార్యక్రమాలు, పల్లకీసేవ జరిపారు. గ్రామంలో పల్లకీని ఊరేగించారు. ఈ సేవలో అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి పాల్గొని పల్లకిమోశారు. పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి, మునిసిపల్ చైర్‌పర్సన్ మంజుల, కౌన్సిలర్ మురళి, నాయకులు విశ్వనాథం, సత్యనారాయణ, మహిపాల్‌రెడ్డి, వెంకట్రాంరెడ్డి, జాఫర్ పాల్గొన్నారు.

ఆ నిధులు కొత్త పనులకే!

- జిల్లాకు రూ.40కోట్ల ప్రత్యేకాభివృద్ధి నిధులు
- పాఠశాలల మెరుగుదల, తాగునీటి అవసరాలకు 30శాతం వెచ్చింపు
- కలెక్టరేట్, ప్రభుత్వ కార్యాలయాల నిర్వహణకూ డబ్బు కేటాయింపు
- మిగతావి అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు..
- ఒక్కో నియోజకవర్గానికి రూ.10కోట్లు



వికారాబాద్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా ప్రత్యేక అభివృద్ధి నిధులు కేటాయించింది. ఒక్కో నియోజకవర్గానికి రూ.10కోట్ల చొప్పున జిల్లాలోని నాలుగు నియోజకవర్గాలకు రూ.40కోట్లు మంజూరు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నిధులతో చేపట్టే పనులు ఇంతకు ముందు ఏ పథకం కింద చేసి ఉండకూడదని స్పష్టం చేసింది. ప్రభుత్వం ప్రత్యేక నిధులు మంజూరు చేయడంతో నియోజకవర్గాల్లో చేపట్టాల్సిన పనుల సమాచారాన్ని సేకరించే పనిలో అధికారులు నిమగ్నమయ్యారు. ఒక్కో నియోజకవర్గ పరిధిలో ప్రత్యేక అవసరాలకు రూ.3.5కోట్లు, ఇతర అభివృద్ధి, సంక్షేమ పథకాలకు రూ.6.5కోట్లు ఖర్చు చేయనున్నారు. ఈ నిధుల్లో 30శాతం నిధులను ప్రభుత్వ, స్థానిక సంస్థల పాఠశాలల్లో సౌకర్యాల కల్పనకు, తాగునీటి అవసరాల కోసం వెచ్చిస్తారు. నాలుగు నియోజకవర్గాలకు కేటాయించిన రూ.40కోట్లులో స్కూళ్లలో సదుపాయాలకు రూ.8కోట్లు, తాగునీటి అవసరాలకు రూ.4కోట్లు, కలెక్టరేట్, ప్రభుత్వ కార్యాలయాల నిర్వహణకు రూ.2కోట్లు, ఇతర అభివృద్ధి, సంక్షేమ పథకాలకు రూ.26కోట్ల చొప్పున ఖర్చు చేస్తారు. నియోజకవర్గానికి కేటాయించిన రూ.10కోట్లలో రూ.2కోట్లు ప్రభుత్వ పాఠశాలల్లో వసతులకు ఖర్చు చేయాలని ప్రభుత్వం నిర్దేశించింది. పాఠశాలల్లో మూత్రశాలలు, మరుగుదొడ్లు, క్రీడా సదుపాయాల పనులు చేపట్టే అవకాశం ఉంది. తాగునీటి అవసరాలు, నిర్వహణ పనులకు కోటి వెచ్చించాలని స్పష్టం చేసింది. రాబోయే వేసవిలో గ్రామాల్లో తాగునీటి ఎద్దడి ఎదురు కాకుండా నివారించేందుకు ప్రభుత్వం కేటాయించిన కోటి రూపాయలు ఖర్చు చేయనున్నారు. ఇదిలా ఉంటే, జిల్లా కలెక్టరేట్‌తో పాటు ఇతర ప్రభుత్వ కార్యాలయాల నిర్వహణకు ఒక్కో నియోజకవర్గానికి రూ.50లక్షలు కేటాయించారు.

ఇన్‌చార్జి మంత్రి అనుమతి తప్పనిసరి

ప్రభుత్వం మంజూరు చేసిన ప్రత్యేక అభివృద్ధి నిధులతో చేపట్టే పనులు గుర్తించడం, నిధులు కేటాయించ డం వంటివి కలెక్టర్, జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఆధ్వర్యంలోనే కొనసాగనున్నాయి. ఎస్‌డీఎఫ్‌తో చేపట్టే పనులకు వారి అనుమతి తీసుకోవాలని ప్రభుత్వం స్పష్టం చేసింది. నిధులమంజూరు అధికారాన్ని ప్రభుత్వం ఇన్‌చార్జి మంత్రికే ఇచ్చింది. ఎమ్మెల్యేల ప్రతిపాదనలను కలెక్టర్ ప్రణాళిక శాఖకు, అక్కడి నుంచి ఇన్‌చార్జి మంత్రికి పంపిస్తారు.

కొత్తగా చేపట్టే పనులకే ఎస్‌డీఎఫ్

జిల్లా పరిధిలో ఐదు నియోజకవర్గా లుండగా, వికారాబాద్, తాండూరు నియోజకవర్గాలు పూర్తి స్థాయిలో జిల్లాలో కొనసాగుతున్నాయి. పరిగి నియోజవర్గంలో నాలుగు మండలాలు జిల్లాలో, రెండు మండలాలు మహబూబ్‌నగర్ జిల్లాలో ఉన్నాయి. అలాగే కొడంగల్ నియోజకవర్గంలోని నాలుగు మండలాలు జిల్లా లో, నాలుగు మండలాలు నారాయణపేట జిల్లా పరిధిలో కొనసాగుతున్నాయి. అలాగే రంగారెడ్డి జిల్లా చేవెళ్ల నియోజకవర్గంలోని నవాబ్‌పేట మండలం జిల్లాలో కొనసాగుతోంది. మరో 4 మండలాలు రంగారెడ్డి జిల్లాలో ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఆయా ఎమ్మెల్యేల సమన్వయంతో పనులను ప్రతిపాదించి కలెక్టర్ ద్వారా ఇన్‌చార్జి మంత్రి ఆమోదంతో చేపడుతారు.

2వ తేదీ నుంచే పంచాయతీలకు ప్రత్యేకాధికారులు



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ సి.నారాయణరెడ్డి, వివిధ శాఖల జిల్లా అధికారులు

- వికారాబాద్ జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి

వికారాబాద్, ఫిబ్రవరి 3 : ఈ నెల 1వ తేదీన సర్పంచ్‌ల పదవీ కాలం ముగిసినందున జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీల్లో ఈ నెల 2వ తేదీనే ప్రత్యేక అధికారులు బాధ్యతలు తీసుకున్నారని జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి తెలిపారు. శనివారం కాన్ఫరెన్స్ ద్వారా రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల మంత్రి ధనసరి అనసూయ(సీతక్క) ములుగు జిల్లా కలెక్టరేట్ నుంచి, హైదరాబాద్ నుంచి పంచాయతీ రాజ్, గ్రామీణా భివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, పంచాయతీ, గ్రామీ ణాభివృద్ధి, ఇంజినీరింగ్ విభాగాల అధికారులతో గ్రామ పంచాయతీల అభివృద్ధిపై సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి, ఉన్నతాధికారులు అడిగిన ప్రశ్నలకు సమాధానంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రతి గ్రామ పంచాయతీకి జిల్లా స్థాయి, మండల స్థాయి అధికారులను ప్రత్యేక అధికారులుగా నియమించామని తెలిపారు. గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులను సిబ్బం దితో సమన్వయం చేసుకొని పనిచేసే విధంగా ప్రత్యేక అధికారులకు బాధ్యతలు కేటాయించామని ఆయన తెలి పారు. వేసవిలో తాగునీటికి ప్రజలు ఎలాంటి ఇబ్బందులు పడకుండా కార్యాచరణ రూపొందించి ప్రణాళికాబద్ధంగా పనిచేసేలా గ్రామీణ నీటి సరఫరా అధికారులకు విధులు కేటాయించామన్నారు. ప్రతి కుటుంబానికి మిషన్ భగీరథ ద్వారా ఆగునీటిని అందిస్తున్నామని తెలిపారు. గ్రామ పంచాయతీల్లో జాతీయ ఉపాధి హామీ పథకం కింద మంజూరైన పనులను వెంటనే ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటున్నామని, అలాగే ఉపాధి హామీ కూలీల సంఖ్యను పెంచేందుకు గ్రామాల్లో అధికారులు పర్యవేక్షి స్తున్నారని, ఉపాధి కూలీలకు ప్రభుత్వం కల్పిస్తున్న సదు పాయాలపై వివరిస్తూ అవగాహన కల్పిస్తున్నారని కలెక్టర్ తెలిపారు. తాగునీరు, పారిశుధ్యం, నర్సరీల నిర్వహణ, మొక్కల సంరక్షణ, డంపింగ్ యార్డులు, వైకుంఠధామాల అభివృద్ధిపై సంబంధిత అధికారుల సమన్వయంతో చర్యలు తీసుకుంటామన్నారు. ఈ నెల 7వ తేదీ నుంచి 15వ తేదీ వరకు గ్రామాల్లో పారిశుధ్యంపై ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. కార్యక్రమాల్లో యువత, ప్రజలు, ప్రజాప్రతినిధులను భాగస్వామ్యం చేస్తున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో అదనపు కలెక్టర్ రాహుల్‌శర్మ, జడ్పీ సీఈఓ జానకిరెడ్డి, జిల్లా పంచాయతీ అధికారి తరుణ్‌కుమార్, గ్రామీణ అభివృద్ధి అధికారి కృష్ణన్ పాల్గొన్నారు.

అధికారులు బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలి

కీసర : గ్రామ పంచాయతీల్లో ప్రత్యేక అధికారులు తమకు కేటాయించిన విధులను బాధ్యతాయుతంగా నిర్వహించాలని మేడ్చల్ జిల్లా కలెక్టర్ గౌతమ్ అన్నారు. శనివారం పంచాయతీ రాజ్ శాఖ మంత్రి ధనసరి అనసూయ(సీతక్క)తో వీడియో కాన్ఫరెన్స్ ఆనంతరం కలెక్టర్ అధికారులు ప్రభుత్వ ఆదేశాలపై దిశానిర్దేశం చేశారు. పంచాయతీల్లో సర్పంచ్‌ల పదవీ కాలం పూర్తి అయిన నేపథ్యంలో పంచాయతీల నిర్వహణ, ప్రజా సేవలకు ప్రభుత్వం ప్రత్యేక అధికారులను నియమించిందని కలెక్టర్ గౌతమ్ ఈ సందర్భంగా తెలిపారు. ఆయా అధికారులు తమకు కేటాయించిన గ్రామాల్లో బాధ్యతతో విధులు నిర్వర్తించాలన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ నెల 7వ తేదీ నుంచి 15వ వరకు గ్రామాల్లో శానిటేషన్ డ్రైవ్‌ను విజయవంతం చేయాలన్నారు. పారిశుధ్య కార్యక్రమంలో గ్రామస్థులు, మహిళలు, యువతను పెద్దఎతున భాగస్వాములను చేసి గ్రామంలో శుభ్రతపై అవగాహన కల్పించాలన్నారు. అలాగే రానున్న వేసవిలో నీటి సమస్య రాకుండా ఇప్పటి నుంచే అవసరమైన చర్యలు చేపట్టాలని ప్రత్యేక అధికారులకు కలెక్టర్ సూచించారు. ఉపాధి హామీ పనులను ప్రారంభించేందుకు చర్యలు తీసుకోవాలని, కూలీల సంఖ్యను పెంచేలా చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు.

మొదటి దశలో క్యాన్సర్‌ను గుర్తిస్తే నియంత్రించొచ్చు

మేడ్చల్ టౌన్, ఫిబ్రవరి 3 : క్యాన్సర్‌ను మొదటి(ప్రాథమిక) దశలో గుర్తిస్తే తగిన చికిత్స చేసి వ్యాధిని నియంత్రించొచ్చని మల్లారెడ్డి నారాయణ ఆసుపత్రి డాక్టర్ స్వప్న అన్నారు. శనివారం మైసమ్మగూడలోని నర్సింహారెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో విద్యార్థులకు క్యాన్సర్‌పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ స్వప్న మాట్లాడుతూ.. తగిన పరీక్షలు, స్క్రీనింగ్ విధానాలతో మొదటి దశలోనే క్యాన్సర్‌ను గుర్తించే అవకాశం ఉందన్నారు. ఒకవేళ వ్యాధి వచ్చిందని తేలితే వెంటనే వైద్యం అందిస్తే క్యాన్సర్ వ్యాధిని అధిగమించి రోగి ఆరోగ్యవంతంగా మారే అవకాశం ఉందన్నారు. ప్రజలు క్యాన్సర్ బారిన పడకుండా తగు జాగ్రత్తలు పాటించాలన్నారు. గుట్కా, మద్యం, ఇతర క్యాన్సర్ కారక పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. యువకులు చెడు అలవాట్లను అలవర్చుకోవద్దన్నారు. నిత్యం పౌష్టికాహారం తీసుకోవటంతో పాటు వ్యాయామం చేయాలన్నారు ప్రస్తుతం క్యాన్సర్ బారిన పడిన చాలామంది ఆరోగ్య పరంగా బాధలు పడుతున్నారని, అలాంటి వారిలో ధైర్యాన్ని నింపే ప్రయత్నం చేయాలన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ లోకనాథం మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండేందుకు ప్రయత్నిస్తూ మంచి అలవాట్లను అలవర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ సీజే.నర్సింహారెడ్డి, కార్యదర్శి త్రిశూల్‌రెడ్డి, కోషాధికారి త్రిలోక్‌రెడ్డి, డీన్ రామదాసు తదితరులు పాల్గొన్నారు.



ఎన్ఆర్ఈసీలో క్యాన్సర్‌పై అవగాహన సదస్సులో మాట్లాడుతున్న డాక్టర్ స్వప్న

రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక



రాష్ట్ర స్థాయికి ఎంపికైన విద్యార్థులతో జిల్లా సోషల్ ఫోరం ఉపాధ్యాయులు

వికారాబాద్, ఫిబ్రవరి 3: గాంధీ గ్లోబర్ ఫ్యామిలీ, గాంధీ జ్ఞాన్‌ప్రతిష్ఠాన్, తెలంగాణ సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయ వేదిక ఆధ్వర్యంలో జడ్పీహెచ్ఎస్ (బాలికల) 10వ తగరతి విద్యార్థులకు జిల్లాస్థాయి సాంఘికశాస్త్ర టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. ఇందులో మీడియం వారీగా ముగ్గురిని రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో సోషల్ ఫోరం జిల్లా అధ్యక్షుడు గాజుల బస్వరాజ్ మాట్లాడుతూ.. విద్యార్థులు ఈటాలెంట్ టెస్ట్ ద్వారా రాబోయో పదో తరగతి పరీక్ష సన్నద్ధతకు ఉపయోగపడుతుందని తెలిపారు. టాలెంట్ టెస్ట్‌ను విజయవంతం చేసిన సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయులకు కృతజ్ఞతలు తెలిపారు. తెలుగు మీడియం నుంచి ధారూరు మండలం కుక్కింద పాఠశాల విద్యార్థి నీలకంఠం, దుద్యాల్ మండలం కుడుమల పాఠశాల విద్యార్థి కె.అశ్విని, ధారూరు కుక్కింద విద్యార్థి స్వప్నతో పాటు దోమ మండలం దీర్సంపల్లి విద్యార్థి అబ్దుల్ రహమాన్ ఎంపికయ్యారు. అదేవిధంగా ఇంగ్లీష్ మీడియంలో మోమిన్‌పేట మేకవనంపల్లి విద్యార్థి నీతిక, వికారాబాద్ బాలికల పాఠశాల విద్యార్థి నందిని, పెద్దేముల్ మంబాపూర్ విద్యార్థి సంపత్ కుమార్‌తో పాటు పూడూరు విద్యార్థి ఇస్మాయిల్ ఎంపికైనట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా సోషల్ ఫోరం ప్రధాన కార్యదర్శి చంద్రమోహన్, లాలయ్య, జాక వెంకటేశం, రాఘవేందర్, యాదయ్య, అరుణ్‌కుమార్, సురేందర్, మధుసూదన్, వెంకటయ్య, వివిధ మండలాల సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయులు, వివిధ మండలాల విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

పిల్లలపై తల్లిదండ్రుల ప్రేమ ఎనలేనిది



ఆకట్టుకున్న విద్యార్థుల నృత్య ప్రదర్శన

కీసర, ఫిబ్రవరి 3: పిల్లలపై తల్లిదండ్రులు చూపే ప్రేమ ఎనలేనిదని జూబ్లీహిల్స్ పబ్లిక్ స్కూల్ చైర్మన్ టి.హరిశ్చంద్రప్రసాద్ అన్నారు. రాంపల్లి దాయరలోని జూబ్లీహిల్స్ పబ్లిక్ స్కూల్ వార్షికోత్సవాన్ని శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి చైర్మన్ హరిశ్చంద్రప్రసాద్, బిట్స్ కళాశాల డీన్ బెనర్జీ, జూబ్లీహిల్స్ పబ్లిక్ స్కూల్ ప్రెసిడెంట్ కృష్ణదేవ్, ప్రాజెక్ట్ డైరెక్టర్ ప్రమోద్ శామ్ జోయిస్‌లు పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. వార్షికోత్సవం సందర్భంగా నిర్వహించిన క్రీడ, వ్యాసరచన, ఇతర పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రధానం చేశారు. అదేవిధంగా వార్షికోత్సవం సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన నృత్య ప్రదర్శనలు కార్యక్రమానికి వీక్షించిన వారిని ప్రత్యేకంగా ఆకట్టుకున్నాయి.

చెట్లను తొలగించిన వారికి నోటీసులు

కీసర, ఫిబ్రవరి 3: హెచ్ఎండీఏ వెంచర్‌లో ఎవెన్యూ ప్లాంటేషన్ చెట్లను తొలగించిన వారికి పంచాయతీ అధికారులు శనివారం నోటీసులు జారీ చేశారు. మండలంలోని గోధుమకుంట గ్రామపంచాయతీ పరిధిలోని సర్వే నంబర్ 42/పీ లోని హెచ్ఎండీఏ వెంచర్‌లో నాటిన 198ఎవెన్యూ ప్లాంటేషన్ చెట్లను గ్రామపంచాయతీలో ఎలాంటి సమాచారం లేకుండా చెట్లను తొలగించారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వుల ప్రకారం గ్రామపంచాయతీ పరిధిలోని హరితహారం చెట్లను తొలగించినందుకు చట్టపరమైన చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది. కావున 42/పీలో ఎవెన్యూ ప్లాంటేషన్ చెట్లను తొలగించిన కందాడి పోచిరెడ్డి, కందాడి రవీందర్‌రెడ్డి, రాంప్రదీప్‌లకు గోధుమకుంట గ్రామపంచాయతీ అధికారులు నోటీసులు జారీచేశారు. మూడు రోజుల్లో పోచిరెడ్డి, రవీందర్‌రెడ్డి, రాంప్రదీప్‌లు వివరణ ఇవ్వాలని లేదంటే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

రంగారెడ్డి జిల్లాలో చిరుత మృత్యువాత

- పెద్ద ఎల్కిచర్ల అటవీ ప్రాంతంలో కళేబరం
- సహజ మరణమేనన్న అటవీ అధికారులు



చిరుత కళేబరాన్ని పరిశీలిస్తున్న అటవీ, పశువైద్యాధికారులు

చౌదరిగూడ, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): రంగారెడ్డి జిల్లా జిల్లేడ్ చౌదరిగూడ మండలం పెద్ద ఎల్కిచర్ల గ్రామ శివారులో చిరుతపులి చనిపోయింది. శుక్రవారం మేకల కాపర్లు శివారులోని అటవీ ప్రాంతంలోకి మేకలను తోలు కెళ్లగా అక్కడ వారికి చిరుత కళేబరం కనిపించింది. శుక్రవారం రాత్రి గ్రామస్థులు ఫారెస్టు అధికారులకు సమాచారం ఇచ్చారు. శనివారం ఉదయం ఫారెస్టు అధికారులు పశు వైద్యాధికారులతో కలిసి ఘటనా స్థలానికి వెళ్లి చిరుత కళేబరాన్ని పరిశీలించారు. చిరుతది సహజ మరణమేనని నిర్ధారించారు. అది నాలుగు రోజుల క్రితం చనిపోయి ఉంటుందని శరీర భాగాలు పూర్తిగా కుళ్లిపోయాయని, వైద్యులు పోస్టుమార్టం నిర్వహించారని రంగారెడ్డి జిల్లా అటవీ అధికారి సుధాకర్ రెడ్డి తెలిపారు. కాగా, అడవిలో మరో చిరుత సంచరిస్తున్న అనవాళ్లున్నాయని, గ్రామస్థులు అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు.

పదోతరగతి పరీక్షల్లో వందశాతం ఫలితాలు సాధించాలి

- జిల్లా విద్యాధికారి రేణుకాదేవి



హెచ్ఎంల సమావేశంలో మాట్లాడుతున్న డిఈవో రేణుక

పరిగి, ఫిబ్రవరి 3 : పదోతరగతి పరీక్షల్లో వందశాతం ఉత్తీర్ణత సాధించాలని జిల్లా విద్యాధికారి రేణుకాదేవి అన్నారు. నియోజకవర్గంలోని ఉన్నత పాఠశాలల హెచ్ఎంలతో శనివారం పరిగి మండల పరిషత్ కార్యాలయంలో పదోతరగతి పరీక్షలపై సమీక్ష నిర్వహించారు. పాఠశాలల వారీగా విద్యార్థుల సంఖ్య, వారి ప్రగతి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులను పరీక్షలకు సంసిద్ధులను చేయాలని సూచించారు. ప్రత్యేక తరగతులు, రోజువారీ పరీక్షలు నిర్వహించి అభ్యసన స్థాయిని పెంచాలని చెప్పారు. చదువులో వెనుకబడిన విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. ఈ సారి జిల్లాలో వందశాతం ఉత్తీర్ణత సాధించే విధంగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. అందరూ బాధ్యతతో పని చేయాలని, ఫలితాలు తక్కువగా వస్తే హెచ్ఎంలు, సబ్జెక్టు టీచర్లే బాధ్యత వహించాల్సి ఉంటుందని తెలిపారు. పరిగి, కులకచర్ల ఎంఈవోలు హరిశ్చందర్, హబీబ్, నాలుగు మండలాల ఉన్నత పాఠశాలల హెచ్ఎంలు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నుంచి నిరంజన్‌రెడ్డి సస్పెన్షన్



మర్రి నిరంజన్ రెడ్డి

ఆదిభట్ల, ఫిబ్రవరి 3 : ఆదిభట్ల మునిసిపాలిటీకి చెందిన కాంగ్రెస్ కౌన్సిలర్ మర్రి నిరంజన్‌రెడ్డిని ఆ పార్టీ అధిష్ఠానం సస్పెండ్ చేసింది. ఆయన పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నాడనే కారణం చూపుతూ కాంగ్రెస్ క్రమశిక్షణ కమిటీ చైర్మన్ జి. చిన్నారెడ్డి శనివారం సస్పెన్షన్ ఉత్తర్వులు జారీ చేశారు. సొంత పార్టీ చైర్‌పర్సన్‌పై అవిశ్వాసంకోసం కౌన్సిలర్లలతో కలిసి ఆయన కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడం, బీజేపీ, బీఆర్ఎ‌స్‌కు చెందిన కౌన్సిలర్లతో క్యాంపు నడుపుతున్నట్లు వచ్చిన అభియోగంపై జనవరి 30న నిరంజన్‌రెడ్డికి పార్టీ షోకాజ్ నోటీసు ఇచ్చిన విషయం తెలిసిందే. ఈ విషయంపై మూడు రోజులలో వివరణ ఇవ్వాలని అధిష్ఠానం ఇచ్చిన షోకాజ్ నోటీసులో పేర్కొన్నప్పటికీ ఆయన నుంచి ఎలాంటి వివరణ రాకపోవడంతో క్రమశిక్షణ చర్యలలో భాగంగా సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు తెలిసింది.

ఇంటర్‌స్కూల్ క్రికెట్ టోర్నీ విజేత నాసర్ స్కూల్



ట్రోఫీతో నాసర్ స్కూల్ జట్టు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): పీబీజేఎస్ స్మారక ఇంటర్ స్కూల్ క్రికెట్ టోర్నమెంట్‌లో నాసర్ స్కూల్ విజేతగా నిలిచింది. మొయినాబాద్‌లోని సూజాత స్పోర్ట్స్ అకాడమీలో గురువారం ప్రారంభమైన ఈ పోటీలు శనివారం ముగిశాయి. ఫైనల్లో తొలుత బ్యాటింగ్ చేసిన ఇండస్ స్కూల్ 12 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 86 పరుగులు చేసింది. ఛేదనలో నాసర్ స్కూల్ 8.5 ఓవర్లలో ఒక్క వికెట్ కూడా కోల్పోకుండా 87 పరుగులు చేసి విజేతగా నిలిచింది. టోర్నీ నిర్వహణకు సహాయ సహకారాలందించిన జ్వాల గుత్తా అకాడమీ ఆఫ్ ఎక్సలెన్స్ ఎండీ క్రాంతికి సూజాత స్కూల్స్ యాజమాన్యం కృతజ్ఞతలు తెలిపింది.

ఇన్‌చార్జిలే దిక్కా?

- రిజిస్ట్రేషన్ల శాఖ తీరు ఇదీ
- రంగారెడ్డి, హైదరాబాద్ ఆడిట్ జిల్లా రిజిస్ట్రార్ పోస్టులు ఖాళీ
- మేడ్చల్ జిల్లా రిజిస్ట్రార్‌కు అసిస్టెంట్ ఐజీగా అదనపు బాధ్యత
- రంగారెడ్డి డీఐజీకి అదనంగా మేడ్చల్ బాధ్యతలు
- అవకతవకలపై ఆడిట్లు కరువు
- ఆదాయ వనరే.. అయినా పట్టించుకోని సర్కారు

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వానికి ప్రధాన ఆదాయ వనరుల్లో ఒకటైన రిజిస్ట్రేషన్ల శాఖలో అదనపు బాధ్యతలతోనే అధికారులు నెట్టుకొస్తున్నారు. ఇన్‌చార్జిల తో పాలన గాడి తప్పింది. రంగారెడ్డి, హైదరాబాద్, సంగారెడ్డి ఆడిట్ జిల్లా రిజిస్ట్రార్ పోస్టులతో పాటు మేడ్చల్ డీఐజీ పోస్టుల్లోనూ ఇన్‌చార్జులే కొనసాగుతున్నారు. ఓవైపు ప్రభుత్వం పదోన్నతులు కల్పిస్తున్నా ఖాళీ పోస్టులకు మాత్రం అర్హత కలిగిన అధికారులతో భర్తీ చేయడం లేదు. ఉన్నవారికే ఒకటికి మించి అదనపు బాధ్యతలు అప్పగించడం వల్ల వారు ఒత్తిడితో ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో పర్యవేక్షణ అంతంతమాత్రమే. ఖాళీగా ఉన్న ఆడిట్ రిజిస్ట్రార్ పోస్టుల్లో రెగ్యులర్ అధికారులకు అదనపు బాధ్యతలు అప్పగించడంతో ఆడిట్లు తూతూమంత్రంగానే చేస్తున్నట్లు తెలుస్తోంది.

కనీసంగా పట్టించుకోని వైనం..

గ్రేటర్ పరిధిలోలో కీలకమైన హైదరాబాద్ జిల్లా ఆడిట్ రిజిస్ట్రార్‌గా నల్గొండలో పనిచేస్తున్న జిల్లా రిజిస్ట్రార్ ప్రకాశ్‌కు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. రంగారెడ్డి జిల్లా ఆడిట్ రిజిస్ట్రార్‌గా అదే జిల్లా రిజిస్ట్రార్ స్థితప్రజ్ఞకు అదనపు బాధ్యతలు అప్పగించారు. మేడ్చల్ జిల్లా రిజిస్ట్రార్ సంతోష్‌ను ప్రధాన కార్యాలయంలో అసిస్టెంట్ ఇన్‌స్పెక్టర్ జనరల్ పోస్టులో ఇన్‌చార్జిగా నియమించారు. గతేడాది ఆగస్టు 22న ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ఇన్‌చార్జి అధికారుల నియామకం జరిగి ఆర్నెల్లవుతున్నా, రెగ్యులర్ అధికారుల నియామకంపై ప్రభుత్వం కనీసం దృష్టి సారించకపోవడం విడ్డూరంగా ఉందని రిజిస్ట్రేషన్ శాఖ వర్గాలంటున్నాయి.

తెగని డీఐజీల పంచాయితీ

మరోవైపు మేడ్చల్ జిల్లాకు డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్‌గా ఆగస్టు 22న పోస్టింగ్ కోసం ఎదురుచూస్తున్న రవీందర్‌ను ప్రభుత్వం నియమించింది. ఆ స్థానంలో ఇన్‌చార్జిగా ఉన్న నిజామాబాద్ డీఐజీ మధుసూదన్‌రెడ్డిని కరీంనగర్ డీఐజీగా బదిలీ చేసింది. జీవో విడుదల చేసిన రెవెన్యూ ముఖ్య కార్యదర్శి నవీన్‌మిట్టల్ 24గంటలు గడవకముందే ఆ పోస్టింగ్స్‌లో మార్పులు చేస్తూ మరొక జీవో జారీ చేశారు. కరీంనగర్‌కు పంపిన డీఐజీ మధుసూదన్‌రెడ్డిని వెంటనే మేడ్చల్ డీఐజీగా, మేడ్చల్ డీఐజీగా రవీందర్ బాధ్యతలు స్వీకరించక మునుపే ఆయనను కరీంనగర్ డీఐజీగా బదిలీ చేస్తున్నట్లు రెండో ఉత్తర్వులో పేర్కొన్నారు. ఈ ఆకస్మిక బదిలీల వ్యవహారంపై ఇద్దరు అధికారులు న్యాయస్థానాన్ని ఆశ్రయించడంతో వారిద్దరినీ ప్రభుత్వానికి రిపోర్టు చేయాలని కమిషనర్ ఆదేశించారు. దీంతో మేడ్చల్ డీఐజీ పోస్టులో రంగారెడ్డి డీఐజీ ట్వింకిల్‌జోన్‌కు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. కిందిస్థాయి అధికారులకు పదోన్నతులిచ్చి రెగ్యులర్ అధికారులుగా నియమించే అవకాశం ఉన్నప్పటికీ ప్రభుత్వం చర్యలు చేపట్టడంలేదని ఉద్యోగ వర్గాలంటున్నాయి. కమిషనర్‌గానూ ఇన్‌చార్జి అధికారే కొనసాగుతుండడం వల్ల కూడా రెగ్యులర్ అధికారుల నియామకంపై దృష్టి పెట్టడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. పదోన్నతులు, రెగ్యులర్ అధికారుల నియామకంపై ప్రభుత్వం దృష్టి సారించాలని ఉద్యోగులు విజ్ఞప్తి చేస్తున్నారు.

జల్సాలకు అలవాటు పడి మూడు నెలల్లో 12 బైకులు చోరీ

- అంతర్ జిల్లా బైక్‌ల దొంగ అరెస్ట్
- రూ. 17.30 లక్షల విలువగల బైకులు స్వాధీనం
- గతంలోనే 13 కేసుల్లో పది సార్లు జైలుకు
- నిందితుడి రిమాండ్ - జిల్లా ఎస్పీ కోటిరెడ్డి



మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ కోటిరెడ్డి

వికారాబాద్, ఫిబ్రవరి 3 : అతడి వయస్సు 24, 15 ఏళ్ల వయస్సులోనే తన తల్లితో కలిసి ఓ దొంగతనం.. ఆపై 13 కేసులలో నిందితుడు.. పది సార్లు జైలు జీవితం గడిపినా మారని వక్ర బుద్ధి.. ఇది పోలీసులు అరెస్ట్ చేసిన ఓ నిందితుడి నేపథ్యం. మూన్నెళ్ల క్రితమే జైలు నుంచి విడుదలై జల్సాలకు అలవాటు పడి 12 బైకులను దొంగిలించి తక్కువ ధరకు అమ్ముకుంటున్న అంతర్ జిల్లా నిందితుడిని వికారాబాద్ పోలీసులు పట్టుకున్నారు. నిందితుడి వద్ద నుంచి రూ. 17.30 లక్షల విలువ గల 12 బైకులను స్వాధీనం చేసుకుని అతన్ని రిమాండ్‌కు పంపిన సంఘటన వికారాబాద్ సీసీఎస్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. శనివారం ఎస్పీ కోటిరెడ్డి సీసీఎస్ పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఈ కేసు వివరాలు వెల్లడించారు. బంట్వారం మండలం తొర్మామిడి గ్రామానికి చెందిన గుడాల మాణిక్యం (24), 2018 నుంచి బైక్‌లను దొంగిలించి వాటికి నకిలీ ఆర్సీలను తయారు చేసి తక్కువ ధరలకు అమ్ముతూ జల్సాలకు అలవాటు పడ్డాడు. ఈ క్రమంలోనే సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో 13 కేసులలో 10 సార్లు జైలుకు వెళ్లిగా 2023 అక్టోబర్‌లో విడుదలయ్యాడు. అయినా తన బుద్ధిని మార్చుకోకుండా మళ్లీ బైక్ దొంగతనాలు మొదలు పెట్టి మూడు నెలల్లోనే రూ. 17.30 లక్షల విలువ గల 12 బైకులు దొంగలించాడు. సైబరాబాద్ పరిధిలోని 10 బైక్‌లు, వికారాబాద్, సంగారెడ్డి పోలీస్ స్టేషన్ పరిధిలో ఒక్కో బైక్‌ను దొంగలించాడు. (రాయల్ ఎన్‌ఫిల్డ్ 3, యమహా 2, బజాజ్ పల్సర్ 6, హుండా షేన్ 1) వీటిని తొర్మామిడిలోని తన పొలం వద్ద షెడ్డును ఏర్పాటు చేసుకుని, అక్కడ భద్రపర్చాడు. గతంలో మెకానిక్ పని చేసిన అనుభవం ఉండడంతో వాటి లాక్‌లు తీసి, తాళం లేనివాటిని దొంగతనాలకు అలవాటు పడ్డాడు.

పోలీసులకు చిక్కింది ఇలా..

శనివారం ఉదయం వికారాబాద్ రైల్వేస్టేషన్ సమీపంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద సీసీఎస్ సీఐలు బలవంతయ్య, బాలస్వామిలు, వికారాబాద్ టౌన్ ఎస్ఐ సత్యనారాయణరాజు తమ సిబ్బందితో తనిఖీలు చేస్తుండగా నిందితుడు టీఎస్ 08 హెచ్ జెడ్ 5070 నెంబర్ గల ద్విచక్ర వాహనంపై వెళుతుండగా అతన్ని ఆపి బైక్ వివరాలు అడుగగా పొంతన లేని సమాధానాలు చెప్పడంతో అనుమానం వచ్చి అదుపులోకి తీసుకున్నారు. పోలీసులు తమదైన శైలిలో విచారించగా అతని నేరచరిత్రను, దొంగలించిన బైక్‌ల వివరాలు వెల్లడించినట్లు ఎస్పీ తెలిపారు. 2009లో మాణిక్యంతో పాటు అతని తల్లిపై దొంగతనం కేసు బంట్వారం పోలీస్‌స్టేషన్‌లో నమోదయిందని చెప్పారు. బైక్ దొంగతనాల విషయంలో నిందితుడికి ఇంకా ఎవరైనా సహకరించారా అనే కోణంలో కూడా దర్యాప్తు చేస్తున్నామన్నారు. క్షుణ్ణంగా వివరాలు సేకరించి నేరస్థుడిపై ఇంకా ఏఏ కేసులు ఉన్నాయని దర్యాప్తుచేసి నిందితుడికి శిక్ష పడేలా చేస్తామన్నారు. నిందితుడి వద్ద నుంచి బైక్‌లు స్వాధీనం చేసుకుని అతన్ని రిమాండ్‌కు తరలిస్తామన్నారు. మన చుట్టే నేరస్థులు ఉండే అవకాశం ఉంటుందని, ప్రతి ఒక్కరూ వారి ఇళ్లు, వ్యాపార సముదాయాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకుంటే నేరాలను అరికట్టే అవకాశం ఉంటుందని ఎస్పీ చెప్పారు. ఈ కేసులో పని చేసిన సీసీఎస్ సీఐలు బలవంతయ్య, బాలస్వామి, సిబ్బంది చెన్నయ్య, గోవింద్, అంజయ్య క్రిష్టారెడ్డి, రాఘవేందర్ రెడ్డి, అంజప్ప, సత్తయ్య గౌడ్, రామకృష్ణ, వికారాబాద్ టౌన్ పోలీస్ అధికారులను ఎస్పీ అభినందించారు. వారికి రివార్డులు అందిస్తామని చెప్పారు.

సిబ్బంది సంక్షేమంలో ముందుంటా

సిబ్బంది సంక్షేమం విషయంలో ఎల్లప్పుడూ ముందుంటానని జిల్లా ఎస్పీ కోటిరెడ్డి చెప్పారు. శనివారం ఎస్పీ కార్యాలయంలో జరిగిన 'ఆన్యువల్ డీ మొబిలైజేషన్ పరేడ్ - 2024' ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిధిగా పాల్గొని మాట్లాడుతూ. ఏఆర్ పోలీస్ అధికారులకు మొబిలైజేషన్‌తో నూతన ఉత్సాహం, సమయపాలన, క్రమశిక్షణతో పనిచేయడం అలవాటవుతుందన్నారు. ఈ సారి మొబిలైజేషన్‌లో ఏఈవో, ఐటీసీటీ, క్లూస్ టీం, ఫింగర్ ప్రింట్, ఫైర్ డిపార్ట్‌మెంట్ అధికారులతో తరగతులు ఏర్పాటు చేశామని చెప్పారు. పోలీసు కుటుంబ సభ్యులకు మెడికల్, హెల్త్ క్యాంపులు, సిబ్బందికి స్పోర్ట్స్ మీట్ ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. జిల్లా అదనపు ఎస్పీ రవీందర్‌రెడ్డి, ఏఆర్ డీఎస్పీ వీరేశ్, ఏవో జోతిర్మయి, ఆర్ఐ అంజత్‌పాషా, ఐటీసీటీ ఇన్‌స్పెక్టర్ రవికుమార్, డీఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ డీవీపీ రాజు, పోలీస్ కంట్రోల్ రూమ్ ఇన్‌స్పెక్టర్ ప్రమీల, ఎస్ఐలు, ఆర్ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

సిలిండర్‌లో గ్యాస్‌కు బదులుగా నీళ్లు

- ఆందోళన వ్యక్తం చేసిన బాధితుడు
- బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్



గ్యాస్ సిలండర్ నుంచి వస్తున్న నీటిని చూపుతున్న బాధితుడు

మొయినాబాద్, ఫిబ్రవరి 3 : వంటగ్యాస్ సిండర్‌ను కొనుగోలు చేస్తే అందులో గ్యాస్ లేకుండా నీళ్లు ఉండటంతో ఓ వినియోగదారుడు ఆందోళన చెందిన సంఘటన మండల పరిధిలోని కేతిరెడ్డిపల్లి గ్రామంలో శనివారం జరిగింది. బాధితుడు పల్లె శేఖర్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. తన ఇంట్లో వంట గ్యాస్‌సిండర్ అయిపోవడంతో స్థానిక ఇండియన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా బుక్ చేసుకుని గ్రామానికి వచ్చిన ఏజెన్సీ వారి నుంచి శేఖర్ సిలిండర్ తీసుకున్నాడు. దాన్ని ఇంటికి తీసుకెళ్లి సీల్ ఓపెన్ చేయగా అందులో నీళ్ల శబ్దం వచ్చింది. అనుమానం వచ్చి వంచితే అందులో గ్యాస్‌కు బదులు నీళ్లు వచ్చాయి. ఈ విషయాన్ని మొయినాబాద్‌లోని ఇండియన్ గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకుల వద్దకు తీసుకు వెళ్లగా ఎలా జరిగిందో కనుక్కుంటామని సమాధానం ఇచ్చారని, గ్యాస్ సరఫరా చేసే వాళ్లు వినియోగదారులను మోసం చేస్తున్నారని బాధితుడు శేఖర్ ఆరోపించాడు. తనకు జరిగిన మోసం మరెవరికీ జరగకుండా సంబంధిత శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశాడు.

'న్యాయ్‌యాత్ర'కు అనూహ్య స్పందన



వంశీచంద్‌రెడ్డికి పుష్పగుచ్ఛం ఇస్తున్న శ్రీనివాస్‌గౌడ్

కడ్తాల్, ఫిబ్రవరి 3 : పాలమూరు ప్రగతి కోసం మక్తల్ నుంచి ఏఐసీసీ కార్యదర్శి , సిడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితుడు, కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే చల్లా వంశీచంద్‌రెడ్డి చేపట్టిన పాలమూరు న్యాయ్‌యాత్ర దిగ్విజయంగా కొనసాగుతోందని టీపీసీసీ సభ్యుడు ఆయిళ్ల శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. మహబూబ్‌నగర్ పార్లమెంట్ నియోజకవర్గంలోని ఏడు నియోజకవర్గాల మీదుగా సాగుతున్న న్యాయ్‌యాత్రకు ప్రజల నుంచి అనూహ్యస్పందన లభిస్తోందని చెప్పారు. శనివారం వంశీచంద్‌రెడ్డిని మక్తల్, నారాయణపేటలో యాత్ర విరామ సమయంలో కల్వకుర్తి కాంగ్రెస్, యూత్‌కాంగ్రెస్ నాయకులతో కలిసి శ్రీనివాస్‌గౌడ్ మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ తమ పార్టీ జాతీయ నేత రాహుల్‌గాంధీ భారత్ న్యాయ్‌యాత్ర చేపట్టగా వంశీచంద్‌రెడ్డి పాలమూరు ప్రగతి కోసం న్యాయ్‌యాత్ర చేపట్టారని అన్నారు. యూత్ కాంగ్రెస్ నాయకులు శేఖర్ గౌడ్, హీరా సింగ్, తులసీరామ్, రాము నాయక్ తదితరులు పాల్గొన్నారు.

రోగులను ప్రైవేటు ఆస్పత్రికి తరలిస్తే కఠిన చర్యలు

- ఆస్పత్రికి అన్ని పరికరాలను సమకూరుస్తాం
- వైద్యులు ఎల్లప్పుడు అందుబాటులో ఉండాలి
- షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



అడ్వయిజరీ కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్, ఫిబ్రవరి 3 : ప్రభుత్వ ఆస్పత్రులకు వచ్చే రోగులను ప్రైవేటు ఆస్పత్రులకు వెళ్లాలని సూచించే వైద్యులు, సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ హెచ్చరించారు. శనివారం షాద్‌నగర్ పట్టణంలోని కమ్యూనిటీ ఆస్పత్రిలో అడ్వయిజరీ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణ కమ్యూనిటీ ఆస్పత్రికి అత్యవసర చికిత్సల కోసం వచ్చే రోగులకు ఆస్పత్రి వైద్యులు చికిత్స అందించకుండా నేరుగా ప్రైవేటు ఆస్పత్రికి తరలిస్తున్నట్లు తన దృష్టికి వచ్చిందన్నారు. ఆ పద్ధతిని మార్చుకోవాలని వైద్యులకు సూచించారు. ఆస్పత్రికి కావల్సిన వైద్య పరికరాలన్నింటినీ ప్రభుత్వం ద్వారా అందజేస్తానని, రోగులకు నాణ్యమైన వైద్యం అందించాలని ఆదేశించారు. ఎల్లప్పుడూ వైద్యులు రోగులకు అందుబాటులో ఉండాలని చెప్పారు.

ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే కాన్పులు జరగాలి

కమ్యూనిటీ ఆస్పత్రితో పాటు, మండలాల్లో ఉన్న ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే కాన్పులు జరిగేలా వైద్య సిబ్బంది చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే అన్నారు. పేద మహిళలు కూడా కాన్పుల కోసం ప్రైవేటు ఆస్పత్రులకు వెళుతున్న విషయం కూడా తన దృష్టికి వచ్చిందని చెప్పారు. డెలివరీ సందర్భంలో ఇబ్బందులు వస్తే ఆపరేషన్లు కూడా నిర్వహించి తల్లి, శిశువులు క్షేమంగా ఉండేలా వైద్య సహాయం అందజేయాలన్నారు. షాద్‌నగర్ కమ్యూనిటీ ఆస్పత్రిలో శస్త్రచికిత్సలు కూడా నిర్వహించాలని చెప్పారు. ప్రైవేటు ఆస్పత్రుల యాజమాన్యాలు రోగుల నుంచి అధిక ఫీజులు వసూలు చేస్తే ఆస్పత్రిని సీజ్ చేయిండానికి కూడా వెనుకాడబోనని హెచ్చరించారు. డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ జయలక్ష్మి, కమ్యూనిటీ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మన ఊరు.. మన బడి ఉత్తదే

గత ప్రభుత్వం చేపట్టిన మనఊరు..మనబడి కార్యక్రమం ఆర్భాటమేనని, పాఠశాలు ఎలాంటి అభివృద్ధికి నోచుకోలేదని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ విమర్శించారు. శనివారం షాద్‌నగర్ పట్టణంలోని జిల్లా పరిషత్ ఉర్దూ మీడియం హైస్కూల్లో ఓ దినపత్రిక యాజమాన్యం విద్యార్థుల కోసం ప్రత్యేక రూపొందించిన ప్రశ్నాపత్రాన్ని ఆయన విద్యార్థులకు అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం గతంలో మైనార్టీ విద్యకు అత్యంత ప్రాధాన్యతనిచ్చిందని తెలిపారు. ఇప్పుడు కూడా తమ ప్రభుత్వం మైనార్టీలకు అండగా నిలుస్తుందని చెప్పారు. బాబర్‌అలీఖాన్, చెన్నయ్య, సయ్యద్ ఖదీర్ పాల్గొన్నారు.

కేటీఆర్, మల్లారెడ్డి నీచపు మాటలు మానుకోవాలి



మాట్లాడుతున్న కాంగ్రెస్ నేత రాజేష్

ఘట్‌కేసర్, ఫిబ్రవరి 3 : ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసేవిధంగా ప్రజాప్రభుత్వాన్ని కూల్చివేస్తామని బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీమంత్రి మల్లారెడ్డి మాట్లాడడంపై కాంగ్రెస్ ఘట్‌కేసర్ మండల అధ్యక్షుడు కర్రె రాజేష్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం మండల పరిధిలోని చౌదరిగూడలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో పార్టీ నాయకులతో కలిసి ఆయన మాట్లాడుతూ శుక్రవారం చౌదరిగూడలో జరిగిన బీఆర్ఎస్ పార్టీ సమావేశంలో వారు కాంగ్రెస్ ప్రభుత్వం, నాయకులపై నోరు పారేసుకోవడంపై విమర్శించారు. కాంగ్రెస్ పార్టీలో చేరడానికి గాంధీభవన్‌కు అల్లుడితో కలిసి ఎందుకు వచ్చారని మల్లారెడ్డిని ప్రశ్నించారు. అక్రమ ఆస్తులను కాపాడుకోవడానికి పార్టీలో చేరడానికి మల్లారెడ్డి రాయబారాలు నడుపుతున్నాడని మండిపడ్డారు. ఆయనను పార్టీలోకి రానిచ్చేదే లేదని స్పష్టం చేశారు. రూ.300 కోట్లు ఖర్చుచేసి ఎన్నికల్లో గెలిచాడని ఆరోపించారు. మల్లారెడ్డి 125గుడిలను సొంత డబ్బులతో కట్టించాడని కేటీఆర్ చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. ఆగుళ్లు ఎక్కడున్నాయో చూపించాలని దమ్ముంటే కేటీఆర్, మల్లారెడ్డికి సవాల్ విసిరారు. మల్లారెడ్డి ఆయన అల్లుడు ఎమ్మెల్యేలు అయిన సరిపోకుండా తన కుటుంబసభ్యులకు కూడా పదవుల కోసం పాకులాడుతున్నాడని ఎద్దేవా చేశారు. చేసిన భూకాబ్జాలు, మింగిన చెరువులే ఆయన్ను శిక్షిస్తాయన్నారు. కందుల కుమార్, పల్లె బాబురావు, కట్ట అంజనేయులు, వినోద్, బోజిరెడ్డి, దావిద్‌రెడ్డి, సిద్దగోని నర్సింహ, అనిల్, వెంకట్‌రెడ్డి దామోదర్ రెడ్డి, జ్ఞానేశ్వర్, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

రైతన్నను మురిపిస్తున్న మామిడి పూత

- గుబురుగా మామిడి తోటలు
- పూతతో కళకళలాడుతున్న చెట్లు
- ఈ సారి అధిక దిగుబడి వస్తుందనే ఆశలో రైతన్నలు



పూడూరులో నిండా పూతతో మామిడి తోట

పూడూరు, ఫిబ్రవరి 3 : మామిడి పూత వికారాబాద్ జిల్లా రైతులను మురిపిస్తోంది. ఎక్కడా చూసినా మామిడి తోటలు పూర్తిస్థాయిలో పూతకు రావడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. పూత ప్రకృతి వైపరిత్యాలను తట్టుకుని నిలబడితే ఈ సారి అధిక లాభం వస్తుందని మామిడి రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో మామిడికి అనువైన నేలలు ఉండడంతో దాదాపు 10,280 ఎకరాల్లో మామిడి తోటలను రైతులు సాగు చేస్తున్నారు. మామిడి సాగుకే ఇక్కడి రైతులు మొగ్గు చూపుతున్నారు.

తీసుకోవాల్సి యాజమాన్య చర్యలు

మామిడి తోటల్లో ప్రస్తుతం సగభాగం పచ్చపూత, ఇంకొంత భాగం తెల్లపూత, మరికొంత భాగం పూమొగ్గ దశల్లో పూత విచ్చుకోకుండా ఉంది. కావున ఇటువంటి పరిస్థితుల్లో రైతులు తేలికపాటి నీటితోడును ఇవ్వాలి. మొదటి రెండు తోడులు తేలికగా ఇచ్చి మూడోది తడి పూర్తిగా ఇవ్వాలి. లేదంటే పూత అధికభాగం పిందె దశలోనే రాలిపోయే ప్రమాదం ఉంటుంది. చెట్టుకు తెల్ల మరియు పచ్చ పూత కంటే పూ మొగ్గలు అధికంగా ఉంటే మల్టీకే 5కేజీలు, సూక్ష్మపోషక మిశ్రమం 2.5 కేజీలు, ప్లానోఫిక్స్ 100 మిల్లీ లీటర్లు లేదా 500 మిల్లీ లీటర్ల నీటితో కలిపి పిచికారి చేయాలి. పచ్చిపూత దశలో తేనెమంచు, బూడిద తెగుళ్ల నివారణకు తయోమిత్సకం 200 గ్రాములు లేదా పిక్రోనిల్ 80శాతం, డబ్ల్యూజీ 150 గ్రాములు ఇవ్వాలి. పూత విచ్చుకున్న తర్వాత 10-15రోజుల వరకు ఎలాంటి మందులు పిచికారి చేయొద్దు. వీలైనంత వరకు పచ్చపూత దశలోనే నివారించుకోవాలి. పూత నుంచి పిందెలు ఏర్పడి బటానీ సైజ్‌లో ఉన్నప్పుడు పదేళ్లు పైబడిన చెట్టుకు డీఏపీ 700 గ్రాములు, ఎంవోపీ 600 గ్రాముల చొప్పున ప్రతి చెట్టుకు వేసి నీరు పెట్టాలి. పండు ఈగ బుట్టలను మిథాయిల్ యూజినాల్ ఎకరానికి 10 - 25 ఏర్పాటు చేసి 20 రోజులకు ఒకసారి మారుస్తూ పంట పూర్తయ్యే వరకు చేయాలని ఉద్యానవనశాఖ పరిగి అధికారి వై.జయంతి సూచించారు.

40 ఎకరాల్లో మామిడి సాగు



బీజాపూర్ జాతీయ రహదారి పక్కన పూడూరు గేటు సమీపంలో దాదాపుగా 40 ఎకరాల్లో వివిధ రకాల మామిడి సాగు చేస్తున్నాము.ముంబాయి, మహారాష్ట్ర, హైదరాబాద్‌కు ఎగుమతి చేస్తాము. ఈ సారి తోటలో ఎక్కువ పూత వచ్చింది. రెండు వారాల క్రితం ఉద్యాన శాస్త్రవేత్తలు వచ్చి ఇక్కడి మామిడి చెట్లను పరిశీలించారు. కొన్ని సూచనలు ఇచ్చారు.

-మధుసూదన్, రైతు, పూడూరు.

మామిడితోటకు అనువైన నేల



పూడూరు మండలంలో మామిడి తోటలకు అత్యధిక అనువైన ఎర్రమట్టి నేలలు ఉండడంతో మామిడి దిగుబడి అత్యధికంగా వస్తుంది. జిల్లాలోని మామిడి పరిమాణంతో పోల్చుకుంటే పూడూరు నేలల్లో పెద్దవిగా కాస్తాయి. ఇక్కడ ఎకరాకు దాదాపుగా 4టన్నుల వరకు దిగుబడి వస్తుంది. ఈ సారి అధిక దిగుబడి వచ్చే అవకాశం ఉంది.

-కాసని మధుసూదన్, రైతు, పూడూరు.

యాచారంలో ఆలస్యంగా..

యాచారం : కొన్నేళ్లుగా మామిడితోటలు చాలా ఆలస్యంగా పూత రావడంతో కాత దిగుబడి గణనీయంగా తగ్గుతుడడంతో రైతులు బెంబేలెతుత్తున్నారు. ఈ సారి పూత ఆలస్యంగా వచ్చినా తమకు లాభాలు వస్తాయనే ఆశలు లేవని రైతులు ఆవేదన చెందుతున్నారు. జనవరి మొదటి వారానికల్లా పూత వచ్చి పిందె పడాలి. కానీ ఫిబ్రవరిలో కూడా ఇంకా పూత దశలో ఉండడంతో పంటపై ఆశలు లేవని రైతులు చెబుతున్నారు. కొన్ని చెట్లు పూర్తిగా పూతకు రాగా మరి కొన్నింటికి సగం కూడా రాలేదు, ఇంకొన్నిటికి అసలు పూతే లేకపోవడంతో రైతులు దిగులు చెందుతున్నారు.

వాతావరణంలో మార్పులు కూడా రైతులను ఆందోళనకు గురి చేస్తున్నాయి. పొగమంచు కమ్ముకోవడంతో పంటకు చీడపీడల బెడద అధికంగా ఉంటుందని రైతులు చెబుతున్నారు. ఉదయం సాయంత్రం వేళ చలి ఉండడం వల్ల పూత ఇంకా వస్తుందని చెప్పారు. కానీ చాలా వరకు పూత రాలుతుండడంతో పంట చేతికందుతుందో లేదో అనే అనుమానంతో ఉన్నారు. పూత దశలో చెట్ల చుట్టూ నీరందించరాదని ఉద్యానవన శాఖ అధికారులు రైతులను కోరుతున్నారు. కాగా మామిడి తోటలకు పూత దశ చాలా కీలకమని రైతులంటున్నారు. పూత దశలో తగు సస్యరక్షణ చర్యలు తీసుకుంటే కొంత మేర లాభాలు వస్తాయని పలువురు రైతులు చెబుతున్నారు. తెగుళ్లు మామిడి దిగుబడిని తగ్గించే ప్రమాదముందని చెప్పారు. కాత బాగా కాసినా వేసవిలో భారీ ఈదురు గాలులు, వడగండ్ల వర్షం కురిస్తే తమకు అప్పులు మిగలక తప్పదని ఆందోళన చెందుతున్నారు. ఈదురు గాలులు, వడగండ్లు లేకుంటే లాభాలు వస్తాయని రైతులు ఆశతో ఉ న్నారు.

సస్యరక్షణ చర్యలు చేపట్టాలి



బోరాన్-19ని లీటర్‌నీటిలో కలిపి పిచికారి చేసుకోవాలి. నత్రజని పొటాష్ లోపం ఉంటే లీటర్ నీటిలో ప్రొఫినోపాస్ 2ఎం ఎల్ లేదా 3 మిల్లీ గ్రాముల కార్బోశిల్ లీటర్ నీటిలో కలిపి పిచికారి చేసుకోవాలి. పూత వచ్చిన తరువాత మొగ్గదశలో ఉన్నప్పుడే లీటర్ నీటిలో డైమోథియేల్ పిచికారి చేసుకోవాలి. పూతలో 4నుంచి 6 వేల పూలుంటాయి. వాతావరణ పరిస్థితులకనుగుణంగా నీటిని అందించడం, పోషక యాజమాన్యం చేపట్టాలి.

- కనకలక్ష్మి, డివిజన్ ఉద్యానవన శాఖ అధికారి

చదువుతో పాటు ఎన్‌సీసీలో రాణించాలి



ఎన్‌సీసీ క్యాంప్‌లో పాల్గొన్న ఎన్‌సీసీ క్యాడెట్లు

ఘట్‌కేసర్ రూరల్, ఫిబ్రవరి 3: విద్యార్థులు చదువుతో పాటు ఎన్‌సీసీలో రాణించి సమాజసేవలో పాల్గొనాలని అనురాగ్ యూనివర్సిటీ సీటీవో డాక్టర్ మల్లేష్ తెలిపారు. వెంకటాపూర్ అనురాగ్ యూనివర్సిటీ ఎన్‌సీసీ క్యాడెట్లు రెండు సంవత్సరాల శిక్షణ కాలాన్ని విజయవంతం చేశారు. దీంతో శనివారం ఎన్‌సీసీ క్యాడెట్లకు ధృవీకరణ పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎన్‌సీసీ అధికారులు, వలంటీర్లు పాల్గొన్నారు.

పీఏసీఎస్ చైర్మన్ పదవి 'హస్త'గతం

బొంరాస్‌పేట్, ఫిబ్రవరి 3: రేవంత్‌రెడ్డి సీఎం అయిన తర్వాత నాయకులు, కార్యకర్తల్లో జోష్ పెరిగింది. మండలంలోని మెట్లకుంట పీఏసీఎస్ చైర్మన్ పదవిని ఎట్టకేలకు కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకుంది. గతంలో బొంరాస్‌పేట్, మెట్లకుంట పీఏసీఎస్ పరిధిలో 13మంది డైరెక్టర్లలో ఒక్క ఓటు మెజారిటీతో చిలుముల్ మైలారం గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నేత విష్ణువర్ధన్‌రెడ్డి చైర్మన్ పదవీ చేపట్టారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం, రేవంత్‌రెడ్డి సీఎం కావడంతో ముగ్గురు పీఏసీఎస్ డైరెక్టర్లు కాంగ్రెస్ పార్టీలో చేరగా మండల కేంద్రానికి చెందిన డైరెక్టర్ బాబురావు ఇటీవల మృతిచెందాడు. దీంతో కాంగ్రెస్ పార్టీ విష్ణువర్ధన్‌రెడ్డిపై అవిశ్వాస తీర్మానాన్ని ప్రవేశపెట్టడంతో తొమ్మిది మంది డైరెక్టర్ల మద్దతుతో అవిశ్వాసం నెగ్గింది. శనివారం మెట్లకుంట గ్రామానికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు జయకృష్ణ ఏకగ్రీవంగా పీఏసీఎస్ చైర్మన్ పదవికి ఎన్నికయ్యారు. దీంతో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆయనను పూలమాలలు, శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్‌లు, కాంగ్రెస్ నాయకులు నర్సిములుగౌడ్, వెంకట్రాములుగౌడ్, మల్లికార్జున్, రాజేశ్‌రెడ్డి, రాంచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



పీఏసీఎస్ చైర్మన్‌గా ఎన్నికైన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు జయకృష్ణతో పార్టీ నాయకులు

క్రైం కార్నర్

బైక్, డీసీఎం ఢీకొని ఒకరి మృతి

- ఇద్దరికి గాయాలు

బొంరాస్‌పేట్, ఫిబ్రవరి 3: రోడ్డు ప్రమాదంలో ఓవ్యక్తి మృతి చెందిన ఘటన బొంరాస్‌పేట్ మండలంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. గుర్మిట్‌కాల్‌కు చెందిన అమరేందర్‌రెడ్డి బైక్‌పై హైదరాబాద్‌కు వెళ్తున్నాడు. ఈ క్రమంలో హైదరాబాద్ నుంచి డీసీఎంలో ఇద్దరు ప్రయాణికులతో కొడంగల్ వైపు వస్తుండగా శనివారం ఉదయం రేగడి మైలారం సమీపంలో బైక్, డీసీఎం ఢీకొన్నాయి. అదుపు తప్పిన డీసీఎం రోడ్డు పక్కనే స్తంభాన్ని ఢీకొట్టగా ప్రమాదంలో బైక్ నుజ్జునుజ్జయింది. బైక్‌పై వెళ్తున్న అమరేందర్‌రెడ్డికి తీవ్రగాయాలు కాగా పరిగి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. డీసీఎంలో వెళ్తున్న సావిత్రమ్మతో పాటు మరొకరికి గాయాలయ్యాయి. డీసీఎం డ్రైవర్ అజహర్ ప్రమాదం నుంచి బయటపడ్డాడు. ఈ ఘటనపై మృతుడి సోదరుడు నరేందర్‌రెడ్డి ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ అబ్దుల్ రవూఫ్ తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో వివాహిత ఆత్మహత్య

ధారూరు, ఫిబ్రవరి 3: అనుమానాస్పదస్థితిలో వివాహిత ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటన మండలంలోని స్టేషన్ ధారూరులో శనివారం చోటుచేసుకుంది. ఎస్ఐ సంతోష్ తెలిపిన ప్రకారం.. స్టేషన్ ధారూరు గ్రామానికి చెందిన గాజుల జయ(27) శనివారం ఇంట్లోనే ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఎనిమిది సంవత్సరాల కిందట ఇదే గ్రామానికి చెందిన తన మేన బావ గాజుల బాలకృష్ణను జయ ప్రేమించి పెళ్లి చేసుకుంది. వివాహమైన తర్వాత వీరికి కొడుకు పుట్టాడు. అయితే బాలకృష్ణ మద్యం తాగి వచ్చి భార్య జయను శారీరకంగా, మానసికంగా హింసిస్తుండేవాడు. ఈ క్రమంలో శుక్రవారం భార్యాభర్తల మధ్య గొడవ జరిగింది. శనివారం జయ ఇంట్లో అనుమానాస్పద స్థితిలో ఉరేసుకుని మృతిచెందింది. కాగా తన చెల్లెలిని భర్త బాలకృష్ణ ఉరివేసి చంపి ఉంటాడని అనుమానం ఉందని మృతురాలి సోదరుడు లాల్‌కోట్ అనంతయ్య ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

భార్యను కడతేర్చిన భర్త

వికారాబాద్, ఫిబ్రవరి 3: కుటుంబ కలహాల కారణంగా కట్టుకున్న భార్యను భర్త కడతెర్చిన ఘటన వికారాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. వికారాబాద్ సీఐ టంగుటూరి శ్రీను తెలిపిన వివరాల ప్రకారం.... మండలంలోని నారాయణపూర్ గ్రామ అనుబంధ గ్రామమైన చింతల బొగుడ గ్రామానికి చెందిన కుర్వ శ్రీనివాస్‌కు పటాన్ చెరువు మండలం పాటీ గ్రామానికి చెందిన మౌనిక(28)తో గత 14 సంవత్సరాల కిందట వివాహమైంది. వారికి ఇద్దరు సంతానం. కాగా కూతురు చనిపోగా కొడుకు ఉన్నాడు. కొంత కాలంగా భార్యాభర్తల మధ్య మనస్పర్థలు రావడంతో గ్రామపెద్దల సమక్షంలో పలుమార్లు పంచాయతీ పెట్టి సముదాయించారు. అయితే శుక్రవారం రాత్రి మౌనిక భర్త శ్రీనివాస్, మరిది రాజు, అత్త చెన్నమ్మ, ఆడపడుచులు జ్యోతి, లతకలిసి మౌనికను తాడుతో బిగించి హత్య చేశారు. మృతురాలి తల్లి లక్ష్మికి ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ శ్రీను తెలిపారు.

పంచాయతీ వర్కర్స్ సమ్మె నోటీసు అందజేత



ఎంపీడీవో సుదర్శన్‌రెడ్డికి సమ్మె నోటీసు ఇస్తున్న సీఐటీయూ నాయకులు, పంచాయతీ వర్కర్స్ యూనియన్

తాండూరురూరల్, ఫిబ్రవరి 3 : బీజేపీ మతతత్వ విధానాలను ప్రతిఘటించేందుకు ఈనెల 16వ తేదీన దేశవ్యాప్త కార్మిక సమ్మెను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు కె.శ్రీనివాస్ పిలుపునిచ్చారు. సీఐటీయూ తెలంగాణ పంచాయతీ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో శనివారం తాండూరు ఎంపీడీవో సుదర్శన్‌రెడ్డికి సమ్మె నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా కె.శ్రీనివాస్ మాట్లాడుతూ.. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి పదేళ్లు గడుస్తున్నా కార్మిక, రైతాంగ, ప్రజల సమస్యలను పరిష్కరించలేదన్నారు. బీజేపీ ప్రభుత్వం ఆత్మనిర్బర్ భారత్, మేకిన్ ఇండియా వంటి కార్మిక వర్గానికి మోసపూరిత వాగ్దానాలు చేసి ఏఒక్కటీ అమలు చేయలేదన్నారు. బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వస్తే రెండేళ్లకోసారి కోటి ఉద్యోగాలు ఇస్తామని హామీ ఇచ్చిందని, ఇచ్చిన హామీ గాలికొదలడంతో నిరుద్యోగం పెరిగిపోయిందని వాపోయారు. రామాలయం పేరుతో ప్రజల మధ్యన, కార్మికుల మధ్యన మత విద్వేషాలతో రెచ్చగొడుతున్నారని ఆరోపించారు. రామాలయం అక్షింతల పేరుతో ప్రజల మనసు మళ్లించే ప్రయత్నం చేశారని, మళ్లీ ఎన్నికల్లో గెలవాలని ప్రధాని మోదీ ప్రయత్నిస్తున్నారని అన్నారు. ఇలాంటి విధానాలకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా కార్మిక, రైతాంగం ఈనెల 16వ తేదీన సమ్మెను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో తాండూరు మండల గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ నాయకులు జిలాని, నర్సింహులు, జగన్, అశోక్, అంజిలప్ప తదితరులు పాల్గొన్నారు.

దుర్గామాతకు ఎమ్మెల్యే దంపతుల పూజలు



పూజలు చేస్తున్న ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి దంపతులు

పరిగి,ఫిబ్రవరి 3: పరిగి ఎమ్మెల్యే డాక్టర్ టి.రామ్మోహన్‌రెడ్డి దంపతులు శనివారం వారి నివాసంలో దుర్గామాత అమ్మవారికి ప్రత్యేకపూజలు చేశారు. ఏటా నిర్వహించే పూజలో భాగంగా పూజలు చేసినట్లు తెలిపారు. రామ్మోహన్‌రెడ్డి ఆయన సతీమణి ఉమార్‌రెడ్డి, డాక్టర్ టి.రీత్వికొరెడ్డిలు కలిసి పూజలు చేశారు.

ఎమ్మెల్యేను కలిసిన కాంగ్రెస్ నాయకులు



ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డికి పూల మొక్కను అందజేసి శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు

బషీరాబాద్, ఫిబ్రవరి 3: మండల కాంగ్రెస్ నాయకులు పలువురు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డిని శనివారం హైదరాబాద్‌లోని నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. రెండు రోజుల కిందట ఢిల్లీలో కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీని ఎమ్మెల్యే కలిసి జాతీయ రహదారులను విస్తరించాలని కోరగా సానుకూలంగా స్పందించిన విషయం తెలిసిందే. ఈక్రమంలో బషీరాబాద్ మండలానికి చెందిన కాంగ్రెస్ నాయకులు పూడూరు శ్రావణ్‌కుమార్, శంకరప్ప, శ్రీకాంత్ తదితరులు ఎమ్మెల్యేను కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

కంది, వేరుశనగ, ధాన్యం బీట్ల ఏర్పాటు

ధారూరు, ఫిబ్రవరి 3: ధారూరు వ్యవసాయ మార్కెట్ యార్డులో శనివారం సాయంత్రం కంది, వేరుశనగ, ధాన్యం పంట ఉత్పత్తులకు బీట్లు నిర్వహించారు. కందులు 507 బస్తాలు రాగా గరిష్టంగా క్వింటాలుకు రూ.10,475, కనిష్టంగా రూ.10వేలు, వేరుశనగ 1122 బస్తాలు రాగా గరిష్టంగా క్వింటాలుకు రూ.7,200, కనిష్టంగా రూ.6,500లు, ధాన్యం(సోనమసూరి) 215 బస్తాలు రాగా క్వింటాలుకు రూ.3 వేలు ధర పలికిందని మార్కెట్ సహాయ కార్యదర్శి సిద్దమ్మ తెలిపారు.

నేడు విద్యుత్ అంతరాయం

వికారాబాద్, ఫిబ్రవరి 3: పట్టణంలోని 33/11 కేవీ విద్యుత్ ఉపకేంద్రంలో అత్యవసర మరమ్మతుల కారణంగా వికారాబాద్ పట్టణంలో విద్యుత్ అంతరాయం ఉంటుందని విద్యుత్ డీఈ సంజీవ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ నిలిపివేస్తామని, విద్యుత్ వినియోగదారులందరూ సహకరిచాలని ఆయన కోరారు.

సాంకేతిక నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలి



జ్యోతిప్రజ్వలన చేస్తున్న ఎంఎస్ఎంఈ కమిషనర్ డాక్టర్ చంద్రశేఖర్

మేడ్చల్ టౌన్, ఫిబ్రవరి 3: సాంకేతిక నైపుణ్యాన్ని విద్యార్థులు పెంపొందించుకోవాలని ఎంఎస్ఎంఈ చైర్మన్ డాక్టర్ చంద్రశేఖర్ అన్నారు. గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ మైసమ్మగూడ మల్లారెడ్డి కాలేజ్ ఫర్ ఉమెన్స్‌లో శనివారం 2కె24 -హ్యాకథాన్ ఈవెంట్‌ను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన డాక్టర్ చంద్ర శేఖర్ మాట్లాడుతూ.. నైపుణ్యంతో ఇంజినీరింగ్ విద్యార్థులకు మంచి భవిష్యత్తు ఉందన్నారు. ఇంజినీరింగ్ రంగంలో రాణించాలనుకునేవారికి ఎంఎస్ఎంఈ తరపున పూర్తి సహాయసహకారాలు అందిస్తున్నామని తెలిపారు. ఇలాంటి ఈవెంట్‌లతో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు పలు ప్రదర్శనలతో తమ ప్రతిభను కనపరిచారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వై.మాధవీలత పాల్గొన్నారు.

ఎస్జీటీయూ డైరీ ఆవిష్కరణ



ఎస్జీటీయూ నూతన డైరీని ఆవిష్కరిస్తున్న డీఈవో రేణుకాదేవి

వికారాబాద్, ఫిబ్రవరి 3: సెకండరీ గ్రేడ్ టీచర్స్ యూనియన్(ఎస్జీటీయూ)-2024 నూతన డైరీని జిల్లా విద్యాధికారి రేణుకాదేవి ఆవిష్కరించారు. డీఈవో కార్యాలయంలో శనివారం యూనియన్ జిల్లా అధ్యక్షుడు బాపనోళ్ల శ్రీనివాస్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు వీరేశం, కోశాధికారి పిల్లికండ్ల నర్సింహులు, మండల అధ్యక్షుడు ఆనంద్ కుమార్ ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రాథమిక పాఠశాలలో ఎఫ్ఎల్ఎన్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని, తరగతికి ఒక ఉపాధ్యాయుడు ఉండాలని సూచించారు.

ఎస్టీటీయూ క్యాలెండర్ ఆవిష్కరణ



ఎస్టీటీయూ క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్

వికారాబాద్, ఫిబ్రవరి 3: ఎస్టీటీయూ వికారాబాద్ జిల్లా క్యాలెండర్ ఆవిష్కరణ శనివారం శాసనసభ స్పీకర్ ప్రసాద్ కుమార్‌చే ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో వికారాబాద్ జిల్లా ఎస్టీటీయూ అధ్యక్షులు బాపనోళ్ల శ్రీనివాస్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి కూతురు నరేందర్, ఉపాధ్యక్షులు కావలి వీరేశం, గౌరవ అధ్యక్షులు నరసింహారెడ్డి ,వికారాబాద్ ప్రెసిడెంట్ ఆనంద్ కుమార్ , ఏ శ్రీనివాస్ రెడ్డి, కోశాధికారి నర్సింలు చారి, రమేష్, మొగులయ్య ,యాదయ్య, కోటపల్లి అధ్యక్షుడు అంజయ్య, ఆంజనేయులు, రాజారత్నం కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందజేస్తున్న మిత్రులు

శామీర్‌పేట, ఫిబ్రవరి 3: అలియాబాద్ గ్రామానికి చెందిన చంద్రశేఖర్(39) అనే వ్యక్తి ఈనెల 19వ తేదీన ఆకస్మికంగా గుండెపోటుతో మృతి చెందాడు. కాగా మృతుడు చంద్రశేఖర్ జడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యనభ్యసించాడు. అప్పటి తన క్లాస్‌మెట్స్ బాధిత కుటుంబాన్ని శనివారం పరామర్శించి రూ.లక్ష ఆర్థిక సాయాన్ని అందజేశారు.

చేవెళ్లలో కృతజ్ఞత సభ

వికారాబాద్, ఫిబ్రవరి 3 : కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారెంటీలలో తెలంగాణ ఉద్యమ కారులకు, అమర వీరుల కుటుంబాలకు ఇంటి స్థలం ఇస్తామని మాట ఇచ్చి అధికారంలోకి వచ్చిన వెంటనే అమలు చేయడానికి ప్రయత్నిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డికి కృతజ్ఞత సభ ఏర్పాటు చేస్తున్నట్లు తెలంగాణ ఉద్యమ కారుల ఫోరం నాయకులు సామల కృష్ణారెడ్డి, పగిడాల నర్సింహారెడ్డిలు ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. చేవెళ్లలో కేజీఆర్ గార్డెన్స్‌లో ఆదివారంఈ కార్యక్రమం ఉంటుందన్నారు. ఈ సమావేశానికి స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, ప్రొఫెసర్ కొదండరామ్, మంత్రి జూపల్లి కృష్ణారావు, ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు చీమ శ్రీనివాస్ వస్తున్నారన్నారు. ఈ సమాశంలో చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి యాలాల మహేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నామని ఉద్యమకారులు అందరూ హాజరు కావాలనికోరారు.

ఫ్లెక్సీలను చింపిన వారిపై చర్యలు తీసుకోవాలి

బషీరాబాద్, ఫిబ్రవరి 03: ఎమ్మెల్యే కార్యక్రమం సందర్భంగా ఇటీవల కొర్విచెడ్‌లో తన ఫ్లెక్సీలను ఏర్పాటు చేయగా చింపిపడేశారంటూ యూత్ ప్రభంజనం అధ్యక్షుడు యం.శ్రీనివాస్ శనివారం బషీరాబాద్ పోలీసులను ఆశ్రయించారు. జడ్పీటీసీ, సర్పంచ్ ఫ్లెక్సీలను ఉంచి తనకు సంబంధించిన వాటిని తొలగించడంపై పలు అనుమానా వ్యక్తంశారు. ఫ్లెక్సీలు చింపిన వారిని గుర్తించి తగినచర్యలు తీసుకోవాలని కోరారు.

ఆలయ నిర్మాణానికి విరాళం

దోమ, ఫిబ్రవరి 3: మండలంలోని మల్లెపల్లి గ్రామంలో నిర్మిస్తున్న శ్రీ లక్ష్మీ నర్సింహస్వామి ఆలయ నిర్మాణానికి కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గుండాల్ గ్రామానికి చెందిన పట్లోళ్ల ప్రభాకర్‌రెడ్డి శనివారం రూ.10వేలు విరాళం అందజేశారు. ఈ సందర్భంగా ఆయనను ఆలయ కమిటీని నిర్వాహకులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో మల్లెపల్లి గ్రామస్తులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణంపై చర్యలు తీసుకోవాలి

తాండూరురూరల్, ఫిబ్రవరి 3: మండలంలోని అంతారంలో గ్రామకంఠం స్థలంలో ప్రజలకు తాగునీరు అందించే పైప్‌లైన్‌పై మెట్లు నిర్మించిన ఎత్తరి కృష్ణపై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కలెక్టర్‌కు శనివారం వినతి పత్రం అందజేశారు. ఎత్తరి కృష్ణకు ఇంటి నిర్మాణానికి అప్పటి సర్పంచ్ గ్రామకంఠం స్థలంలో 30 చదరపు గజాల స్థలాన్ని ఇచ్చారు. మూడు గదులు నిర్మించుకున్న కృష్ణ అక్రమంగా మరింత స్థలం కబ్జా చేసుకుని మరో గదిని నిర్మించుకున్నట్లు గ్రామస్తులు తెలిపారు. రెండు రోజుల కిందట కొత్తగా నిర్మించుకున్న గదికి ప్రధాన తాగునీటి పైప్‌లైన్‌పై నుంచి మెట్లు వేశాడు. పైప్‌లైన్‌కు ఆనుకుని మరుగుదొడ్డిని కూడా నిర్మించినట్లు వారు పేర్కొన్నారు. గ్రామకంఠం స్థలాన్ని కబ్జా చేసుకుని నిర్మిస్తున్నట్లు అధికారులకు ఫిర్యాదు చేసినా ఎవరూ పట్టించుకోవడం లేదని గ్రామస్తులు వాపోయారు. వెంటనే తాగునీటి పైప్‌లైన్‌కు ఆనుకుని ఉన్న మరుగుదొడ్డి రింగులను తొలగించి ప్రధాన పైప్‌లైన్ నుంచి నల్లా కనెక్షన్ తొలగించేలా చర్యలు తీసుకుకోవాలని కోరారు. కలెక్టర్‌కు వినతిపత్రం అందజేసిన వారిలో నర్సింహులు, అంజిలప్ప, పుల్లయ్య, దస్తప్ప, శేఖర్, సత్యప్ప, అంజిలయ్య, లాలప్ప, బి.రాములు, ఆశప్ప పాల్గొన్నారు.

క్రీడలతో స్నేహబంధాలు పెంపొందుతాయి



టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న పన్నాల కొండల్‌రెడ్డి

ఘట్‌కేసర్ రూరల్, ఫిబ్రవరి 3: క్రీడలతో స్నేహబంధాలు పెంపొందుతాయని బీఆర్ఎస్ మండల ప్రధానకార్యదర్శి పన్నాల కొండల్‌రెడ్డి తెలిపారు. మండలంలోని అవుషాపూర్‌లోని ద్రోణాచార్య క్రికెట్ మైదానంలో శనివారం పన్నాల కొండల్‌రెడ్డి ఆధ్వర్యంలో ఏపీఎల్ క్రికెట్ పోటీలను ప్రారంభించారు. క్రీడాకారులు క్రీడాస్ఫూర్తిని చాటి ముందుకు సాగాలని తెలిపారు. క్రీడలతో జాతీయ అంతర్జాతీయ స్థాయిల్లో గుర్తింపు లభిస్తుందన్నారు. ఏపీఎల్ టోర్నమెంట్‌లో గ్రామానికి చెందిన పదిజట్లు పాల్గొన్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ ఎల్లాని అయిలయ్యయాదవ్, మాజీ సర్పంచ్ డొంకెని బిక్షపతిగౌడ్, వార్డుసభ్యుడు శ్రీనివాస్‌గౌడ్, వీరేశం, కాంగ్రెస్ గ్రామశాఖ అధ్యక్షుడు వామన్‌రెడ్డి నాయకులు దయాకర్‌రెడ్డి, వీరేష్‌యాదవ్, క్రీడాకారులు పాల్గొన్నారు.

కార్మికులకు కనీస వేతనాలు ఇవ్వాలి



వినతిపత్రం అందజేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులు

బొంరాస్‌పేట్, ఫిబ్రవరి 3: మధ్యాహ్న భోజన కార్మికులకు కనీస వేతనాలు రూ.26వేలు అందించి ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు బుస్స చంద్రయ్యా అన్నారు. ఈనెల 16న దేశ వ్యాప్త సమ్మెలో భాగంగా సమ్మె నోటీసును శనివారం మండల కేంద్రంలోని ఎమ్మార్సీ కార్యాలయంలో సిబ్బందికి కార్మికులతో కలిసి అందజేశారు. ఈ కార్యక్రమంలో మధ్యాహ్న భోజన కార్మికులు సరిత, సుశీలమ్మ, వెంకటమ్మ, రాములమ్మ, బుజ్జమ్మ పాల్గొన్నారు.

క్యాన్సర్‌పై ప్రజల్లో అవగాహన రావాలి



తాండూరులో న్యాయ విజ్ఞాన సదస్సులో ప్రసంగిస్తున్న తాండూరు జూనియర్ జడ్జి శివలీల

తాండూరు ఫిబ్రవరి 3: క్యాన్సర్ వ్యాధిపై ప్రజల్లో అవగాహన రావాలని జూనియర్ జడ్జి శివలిలా అన్నారు. తాండూరు జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో శనివారం మండల న్యాయ అధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సును నిర్వహించారు. ప్రపంచ క్యాన్సర్ నిరోధక దినోత్సవం సందర్భంగా న్యాయమూర్తి క్యాన్సర్‌పై ప్రజలకు వివరించారు. క్యాన్సర్‌పై ప్రజల్లో పూర్తిస్థాయి అవగాహన కల్పించేందుకు వైద్యులు కృషిచేయాలని కోరారు. జిల్లా ఆస్పత్రి సూపరిం టెండెంట్ డాక్టర్ మూర్తి మాట్లాడుతూ.. ప్రాథమిక దశలోనే క్యాన్సర్‌ను గుర్తిస్తే చికిత్స సులువుగా ఉంటుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మఠం చంద్రశేఖర్, ప్రధాన కార్యదర్శి రవికుమార్, ఉపాధ్యక్షులు నర్సప్ప, కార్యదర్శి రజిత, న్యాయవాదులు శివకుమార్, పి.శ్రీనివాస్ పాల్గొన్నారు.

అట్టహాసంగా నక్క ప్రభాకర్ జన్మదిన వేడుకలు



నక్క ప్రభాకర్‌తో కేక్‌కట్ చేయిస్తున్న మాజీ సర్పంచ్ ఈశ్వర్

మేడ్చల్ టౌన్, ఫిబ్రవరి 3: కాంగ్రెస్ నాయకులు నక్క ప్రభాకర్ జన్మదిన వేడుకలు శనివారం మేడ్చల్ కాంగ్రెస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. గుండ్లపోచంపల్లి మాజీ సర్పంచ్ బేరీ ఈశ్వర్ ఆధ్వర్యంలో పలువురు కాంగ్రెస్ నాయకులు నక్క ప్రభాకర్‌తో కేక్‌కట్ చేయించారు. అనంతరం శాలువాకప్పి సన్మానించారు.

మైనార్టీల సంక్షేమానికి చర్యలు తీసుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్బీ.గుల్షన్

కొడంగల్ రూరల్, ఫిబ్రవరి 3: మైనార్టీల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఎంఐఎం నియోజకవర్గ అధ్యక్షుడు ఎస్బీగుల్షన్ అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. సీఎం సొంత నియోజకవర్గమైన కొడంగల్‌లో ముస్లింల అభ్యున్నతికి ప్రత్యేక చొరవ చూపించాలని కోరారు. కొడంగల్ పర్యటనకు రానున్న సీఎం రేవంత్‌రెడ్డి అన్నివర్గాలకు సమానంగా కొడంగల్‌లో ఉర్దూ ఘర్ షాదీఖానా నిర్మాణం, మైనార్టీ గురుకుల పాఠశాల భవనం, శ్మశానవాటిక ప్రహరీ తదితర అభివృద్ధి పనులకు శంకస్థాపన చేయాలని కోరారు. ముస్లింలు ఫంక్షన్ హాళ్లలో పెళ్లిలు చేసే ఆర్థిక స్థోమత లేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. తాండూర్ రోడ్డులో శిథిలావస్థలో ఉన్న షాదీఖానా భవనం స్థానంలో నూతన నిర్మాణం నిర్మించాలని కోరారు. అదేవిధంగా ముస్లిం విద్యార్థులకు పోటీ పరీక్షల నిమిత్తం ఉచిత శిక్షణ కేంద్రాలు, నిరుపేద విద్యార్థులు విదేశాల్లో చదువుకునేందుకు ఓవర్సీస్ స్కాలర్‌షిప్‌లు, మైనార్టీలకు ఆర్థిక భరోసా కింద సాయాన్ని అందజేయాలన్నారు. ఈ సమావేశంలో ఎండీ.సర్తాజ్ హుసేన్, సయ్యద్ ముస్తఫా, ఎండీ.ముర్తజా, ఎండీ.అజహర్, ఎండీ.షానవాజ్ హుసేన్, సయ్యద్ అర్షద్ అలీ ఖాద్రీ తదితరులు పాల్గొన్నారు.

నేటి బాలలే రేపటి పౌరులు



విద్యార్థులకు ప్రశంసపత్రాలు అందజేస్తున్న సుదర్శన్

వికారాబాద్, ఫిబ్రవరి 3: నేటిబాలలే రేపటి పౌరులని, శాస్త్రీయ ఆలోచనలను పెంపొందించుకొని, పరిపూర్ణ మానవులుగా ఎదగాలని జిల్లా ప్రధాన న్యాయాధికారి కె.సుదర్శన్ అన్నారు. వికారాబాద్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో చెకుముకి సైన్స్ సంబురాలు (జిల్లా స్థాయి ప్రతిభ పరీక్ష) నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా 13 టీంలు పాల్గొన్నాయి. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన న్యాయ అధికారి మాట్లాడుతూ.. రాజ్యాంగంలోని 51ఏహెచ్‌ను అవగాహన చేసుకోవాలన్నారు. దీని వల్ల పరిసరాల్లో సమాజంలో జరుగుతున్న అనేక విషయాలను ప్రశ్నించడం, పరిష్కారాలు వెతకటం జరుగుతుందని చెప్పారు. జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర కార్యదర్శి వెంకటరమణ మాట్లాడుతూ.. ఆదిమానువుడి కాలంలో చెకుముకి రాయి ద్వారా వెలువడిన నిప్పు అజ్ఞానం నుంచి విజ్ఞానం వైపు సమాజాన్ని తీసుకుపోవడానికి ఎంతగానో ఉపయోగపడిందని తెలిపారు. ప్రతిభా పోటీల్లో విజేతలుగా ఎంపికైన టీంలు ఫిబ్రవరి 9, 10 ,11 తేదీల్లో జనగామ జిల్లా కేంద్రంలో జరిగే రాష్ట్ర స్థాయి చెకుముకి సైన్స్ సంబరాల్లో పాల్గొననున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జనవిజ్ఞాన వేదిక వికారాబాద్ జిల్లా నాయకులు రత్నం, అబ్దుల్ కవి, శ్రీనివాసులు, పుష్పలత, నవీన్ కుమార్, పాఠశాల ఇన్‌చార్జిలు, హెచ్ఎంలు తదితరులు పాల్గొన్నారు.

పరిశుభ్రతకు ప్రాధాన్యతనివ్వాలి



ఎన్కతల ప్రత్యేకాధికారిణిగా బాధ్యతలు స్వీకరిస్తున్న ఎంపీడీవో శైలజారెడ్డి

మోమిన్‌పేట్, ఫిబ్రవరి 3: గ్రామాల్లో పారిశుధ్య పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని ఎంపీడీవో శైలజారెడ్డి అన్నారు. మండలంలోని ఎన్కతల, కేసారం, ఎన్కెపల్లి గ్రామాలకు ప్రత్యేకాధికారిణిగా ఆమె శనివారం బాధ్యతలు స్వీకరించారు. గ్రామ పంచాయతీ రికార్డుల నమోదును జాగ్రత్తగా చేపట్టాలన్నారు. అనంతరం ఎన్కెపల్లిలో మాజీ సర్పంచ్ అంతమ్మ పాలకవర్గ సభ్యులకు వీడ్కోలు సమావేశంలో పాల్గొని పూలమాలలు, శాలువాలతో సన్మానించారు. సర్పంచ్‌లకు పదవులు ముఖ్యం కాదని, పదవిలో ఉన్నాలేకున్నా ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు మహిపాల్‌రెడ్డి, తిరుపతమ్మ, కారోబార్ విఠల్‌రెడ్డి పాల్గొన్నారు.